తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

డిశంబర్-2024


వెల: ₹20

**గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు!**

**పాలాభిషేకం తప్పు!**

ఎందుకూ?!....

వివరాలు 11వ పేజీలో



# బాపురమణ అకాడమీ

ఆత్రేయపురం-హైదరాబాద్

గౌరవాధ్యక్షులు
'కళారత్న' బ్నిం

ప్రధాన కార్యదర్శి
'కళామిత్ర' వేగిరాజు సుబ్బరాజు

# బాపురమణ పురస్కార ప్రదానోత్సవం 2024

**డిశంబర్ 15, ఆదివారం సాయంత్రం 6గంటలకి**
**ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్, మొదటి అంతస్థు, బంజారాహిల్స్, హైదరాబాద్**



## 'బాపు' పురస్కారం

ప్రముఖ కార్టూనిస్టు **శ్రీ సురేంద్ర** గారికి.



## 'రమణ' పురస్కారం

ప్రముఖ రచయిత **శ్రీ భువనచంద్ర** గారికి.



## జీవిత సాఫల్య పురస్కారం

ప్రముఖ రచయిత

**శ్రీ ఆకెళ్ళ వెంకటసూర్యనారాయణ** గారికి.

ప్రముఖుల సమక్షంలో జరిగే ఈ పూతరేకుల పండుగకి

**అందరూ ఆహ్వానితులే**

Regd Off: Plot No - 51/2P, Road No-2, Tulasi Nagar, Opp. JNTU, HMT Hills Road, Kukatpally, Hyderabad-72
Ph: 9490608899, 9848208899. Email: aatreyapuram@gmail.com

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

జీ'వనం'లో నవ్వు నవ వసంతం

# హాస్యానందం

డిశంబర్-2024

21వ సంవత్సరం
246 వ సంచిక

ముఖచిత్రం: పూజాహెగ్డే ✦ కార్టూన్: గోపాలకృష్ణ

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Publisher& Editor-*
*Ramu.P*

*Full Pillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*

Dr. K.Ramakrishna, Bachi
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
GopalKrishna, Gandhi, Nagisetty,
Bomman, Dayakar, Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:* Surya

*Well Wishers:*

Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*

K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
G.Venkat Reddy

| | |
|---|---|
| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలతో) | 2 సంవత్సరాల చందా-రూ.500/- (పోస్టల్ చార్జీలతో) |

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.




Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

### కథలు


| | | |
|---|---|---|
| దెగిసాతో గంగాళం | -డాక్టర్ దేవులపల్లి పద్మజ | -20 |
| అవతారం పెళ్ళికి అందరూ రండి | -బెల్లంకొండ నాగేశ్వరరావు | -30 |
| అపాయంలో ఉపాయం | -పద్మ పైడిమర్రి | -34 |
| బహుమతి గ్యారంటీ | -పేట యుగంధర్ | -38 |
| దాన వీర శూర కర్ణ | -ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | -40 |
| సూపర్...బాసూ! | -మార్లపూడి ఆనందకుమార్ | -45 |
| అమ్మో!... ఇంకా నయం! | -కొత్తపల్లి ఉదయబాబు | -46 |


### స్పెషల్స్


| | |
|---|---|
| గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు | -18 |
| ఆనందోత్సాహాలతో కార్టూనిస్టుల కార్తిక సమ్మేళనం 2024 | -28 |


### శీర్షికలు



| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -10 |
| వాక్చిత్రం | -సుధామ | -17 |
| కొత్త పుస్తకాలు | | -25 |
| స్మైల్ స్టార్స్ | -పద్మ | -26 |
| వెనక్కి వెళ్ళే కథలు | -వడ్లమన్నాటి గంగాధర్ | -32 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -36 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |


### సీరియల్



| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -12 |









### ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- శర్మ
- బాచి
- నందు
- రామ్‌శేషు
- గాంధీ
- నాగిశెట్టి
- సాయికృష్ణ
- డేవిడ్
- బొమ్మన్
- శేషయ్య
- బీవీఎస్
- సునీల్
- పద్మ
- జెఎన్నెమ్
- మోహన్ కుమార్
- ఓంకార్
- తోపల్లి ఆనంద్
- చక్రవర్తి
- గౌతమ్
- ఎమ్.ఎమ్.మురళి
- శంబంగి
- ప్రసాద్ కాజ
- రవీంద్ర
- ప్రసిద్ధ
- టి.ఆర్.బాబు
- టి.భాస్కర్
- కాశ్యప్
- ఆదినారాయణ
- నాథ్
- శేషి
- పుష్ప
- దొరశ్రీ
- ఎన్.ధీరజ
- అనసూయ
- కామేష్
- రవిశర్మ
- భాను
- శేఖర్‌బాబు
- ప్రభాకర్ అంతోటి
- లాల్
- కృష్ణశ్రీ
- అరుణ్
- షేక్ సుభాని
- శిరి
- సురేన్ద్ర
- భగవాన్
- సురేష్



### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -14 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -15 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -22 |
| నవ్వేమందు | -ప్రసిద్ధ | -37 |
| కా.కా.క.క. | -బాచి | -43 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -48 |


**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించ పరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు...**
**హాస్యప్రియులకు...సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**మ**నం బాధ పడకుండా (నిజం చెప్పి) ... అలాగే ఎదుటివాళ్ళనీ బాధ పెట్టకూడదని కొన్నిసార్లు అబద్ధాలు చెప్పటం పరిపాటి!

అయితే ఈ 'అవసరానికో అబద్ధం' కాస్త మితిమీరిపోయి...
మన జీవనవిధానంలో ఒక భాగమయిపోయిందేమో అనిపిస్తోంది.
ఫోన్ లిఫ్ట్ చేయని ప్రతిసారీ 'సైలెంట్'లో ఉందనో, రిపేర్‌లో ఉందనో... ఆలస్యంగా వచ్చినప్పుడల్లా 'ట్రాఫిక్' జామ్ అనో... ఆఫీసుల్లో 'కంప్యూటర్ నెట్ వర్క్' వలన పని కాలేదనో... ఇలా ఒకసారి వినడానికి, నమ్మినా నమ్మకపోయినా బాగుంటుంది గానీ ప్రతిసారీ 'ఇవే' మాటలు వింటే అవతలి వ్యక్తి మీద నమ్మకం పోతుంది. అనుమానాలు మొదలవుతాయి.
మనిషి మనసులో అనుమానాలు మొదలవనేకూడదు... మొదలయిందంటే అవతలి వ్యక్తి ఎంత నిజం చెప్పినా 'తాతా పులి' కథలా మారుతుంది.
ఉదాహరణకి 'ఫోన్ రిపేర్' అని చెప్పి ఒకసారి తప్పించుకోవచ్చు. కానీ ప్రతిసారీ అదే 'కారణం' చెబితే ఆ నిజం అబద్ధంగా మారే ప్రమాదం ఉంది.
మనం ఒక పని చేయటం కోసం 'ఒక అబద్ధాన్ని సృష్టించి' ఎదుటివాళ్ళని నమ్మించడానికి చేసే ప్రయత్నాలు... ఆ 'అబద్ధం' అబద్ధమని తెలిస్తే పరిస్థితులు మనల్ని 'ఇబ్బంది' పెడతాయి. ఇలాంటి సందర్భాల్లో 'నా ఇష్టం' అనే వాదనే కరెక్ట్! (అబద్ధం అవసరం లేదు).

బంధాల్ని నిలబెట్టుకోవటం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో అబద్ధమాడటం తప్పు కాదు! కొన్ని సందర్భాల్లో 'నిజం' ఇబ్బంది పెట్టినా సరే పరిస్థితిని... వివరించి 'ఒప్పించటం' ఉత్తమం.

అబద్ధం మన పనిని సానుకూల పరచాలిగానీ... వీడు నోరుతెలిస్తే అబద్ధాలాడతాడు అనే 'ప్రఖ్యాతి' తీసుకురాకూడదు.

అందుకే కర్ర విరగకుండా పాము చావకుండా అవసరానికే కాదు... తప్పని పరిస్థితుల్లోనే అబద్ధం చెప్పి మన గౌరవాన్ని కాపాడుకుందాం!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....



## రీసౌండ్

**✦తూలుగు రమణారావు అక్కరాపల్లి**

మొదటి పేజీ నుండి చివరి పేజీ వరకు నవ్వుల పువ్వులు పంచిన హాస్యానందం వారికి కృతజ్ఞతలు. బహుమతి కార్టూన్లు పదే పదే నవ్వించాయి. అయ్యారే రొట్టె ముక్క, కిలకిలలు గలగలలు కథలు బాగున్నాయి. కొంగుచాటు కృష్ణుడును ఇలాగే కొనసాగించి మామ్మానందింపజేయ ప్రార్థన. జయదేవ్, సరసి కార్టూన్లు ఎన్నిసార్లు చదివించాయో... పత్రిక ఇలాగే నిరంతరం నవ్వులు పంచుతునే వుండాలి.

**✦ పి.వి. పద్మావతి మధు నివ్రితి, సికింద్రాబాద్**

నవంబర్ 2024 సంచికలో 'నాగుల చవితి' నవ్వులు బుస కొట్టి మరీ నవ్వించాయి. 'లిక్కర్ కార్టూన్' (అట్టమీద) మరియు (లోపల) 'వన భోజనాలు ముందు, తరువాత' కార్టూన్ చాలా బావున్నాయి. మద్యం, పొగాకు, ప్లాస్టిక్‌ను–వాటి ఉత్పత్తి–అమ్మకం వెంటనే చట్టం ద్వారా నిషేధించాలి. నరకం ప్రపంచం... క్షణంలో స్వర్గంలా మారిపోతుంది. డబ్బులు, శాంతి, మంచి ఆరోగ్యం ఆదా అవుతుంది. పర్యావరణంకు మేలు జరుగుతుంది. ప్రపంచంలో 8 బిలియన్ ప్లాస్టిక్ కాలుష్యం వలన (నీటిలో, మట్టిలో పేరుకుపోయి)... అవి తిని, వాటి రసాయనాలు–విషం వల్ల ఎన్ని జీవాలు (పక్షులు, జంతువులు) చనిపోతున్నాయి. పర్యావరణం అతలా కుతలం అవుతున్నది.



**✦ శ్రీలేఖ.పి.ఎస్., హైదరాబాద్**

హాస్యానందం నాలుగు (4) స్తంభాలాట... **1.** కార్టూన్లు–జోకులు (హాయిగా నవ్వించే అపహాస్యం లేని, కష్టం–నష్టం కలిగించని జోకులు...ముందుగా అవి చదువుతాం) **2.**హాయ్ సానందంగా (ఈసారి– నవంబర్ 2024 సంచికలో ప్రయత్నం గురించి, వయస్సు మనస్సుకు కాదు అని చక్కగా వర్ణించారు రాముగారు. **మా సూచన:** 'ఆకాశం నీ హద్దు రా, అవకాశం వదలొద్దు రా' ... 'సొమ్మొకడిది–సోకొకడిది' సినిమా (1979) పాట రోజూ వినాలి ప్రతి ఒక్కరూ. యెనలేని శక్తి–ఉల్లాసం వస్తుంది అందరికీ. **3.** చిన్న కథలు (తరువాయి చదువుతాం) **4.** పదానందం (మెదడుకు మేతయే కాదు... సంతోషం ఇస్తుంది మరియు తెలుగు పదాలు–భాష పునరావృత్తం అవుతుంది... ఆఖరిపోరాటంగా ఓ పట్టు పడతాం).

**5.** ఐదవ మూల స్తంభం– 'అవార్డులు–రివార్డుల–పారితోషకం ఇస్తూ ప్రోత్సాకరపు నిర్వహణ.

YES! Hasyanandam is a role model to the world on HAPPY Development Management. All worries and diseases, problems, pains, stress will evaporate, thus bad health will disappear.

**✦ జి.వి.రమేష్, బెంగళూరు**

హాస్యానందం నవంబరు సంచికలో ప్రచురించిన ఐదు కథలు, 70 కార్టూన్లు ఆహ్లాదకరమైన హాస్యంతో ఎంతగానో అలరించాయి. ఒక మంచిపత్రిక నిర్వహణకు హాస్యానందం కేరాఫ్ అడ్రస్!





**సాంకేతికతకి పరాకాష్ట ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్!**

**రాబోవు కాలంలో ఇది ఎలాంటి పరిణామాలు సృష్టిస్తుందో... ఎవరూ ఊహించనిది! మన రచయితలు, కార్టూనిస్టులు వీటి పర్యావసానం ఎలా ఉంటుందో నవ్వుల పూతతో వచ్చే సంచికలో మీ ముందుంచబోతున్నారు....**

**అందుకే జనవరి-2025 హాస్యానందం సంచిక ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రత్యేక సంచికగా రూపొందుతుంది.**

**పత్రిక నిర్వహణా వ్యయం బాగా పెరిగి పోయినందువలన వచ్చే సంచిక నుండి తప్పని పరిస్థితుల్లో హాస్యానందం విడి ప్రతి 25 రూపాయలుగా నిర్ణయించడమైనది. ఎప్పట్లానే మీ ఆదరాభిమానాలు కోనసాగుతాయని ఆశిస్తూ...**



**డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి) ఆశీస్సులతో**
**గుదిబండి వెంకట రెడ్డి, హాస్యానందం సౌజన్యంతో**
**నిర్వహిస్తున్న కార్టూన్ పోటీ**

శ్రీ గుదిబండి వెంకట రెడ్డి గారు కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు. కార్టూనిస్టు మిత్రులు అందరూ పాల్గొనాలని మా మనవి

**10 బహుమతులు**
**ఒకోక్కటి 3000 రూపాయలు**

**మెమొంటో**
**+**
**సర్టిఫికెట్**

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: డిశంబర్, 10, 2024
ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను. **hasyanandampoteelu@gmail.com**

**నిబంధనలు**


- 'అంశం' ఏదైనా ఫరవాలేదు గానీ నవ్వు పుట్టించేలా కార్టూన్లు ఉండాలి. దయచేసి అశ్లీల అంశాల జోలికెళ్ళొద్దు!
- పోటీలో పాల్గొనే కార్టూనిస్టులు, తాము పంపే మెయిల్‌లో పేరు, ఫోన్ నెంబరు తప్పని సరిగా ఉండాలి!
- బహుమతి ప్రదానోత్సవ సభ **ఫిబ్రవరి 2025 లో హైదరాబాదులో జరుగుతుంది.** వివరాలు ఫిబ్రవరి హాస్యానందంలో ప్రచురిస్తాం!

'తెలుగా మజాకా?!' రచయిత
**డాక్టర్ కప్పగంతు రామకృష్ణ** రచన

**దేవుణ్ణి చూద్దాం... రండి!**

గుడికి ఎందుకు వెళ్ళాలి?
ప్రదక్షిణలు ఎందుకు చెయ్యాలి? అందుకు నియమాలేమిటి?
ఆలయానికి గోపురం, మండపాలు ఎందుకు ఉండాలి?
ఆలయానికి ధ్వజస్తంభం లేకపోతే ఏమవుతుంది?
ఆలయాల్లో బలి ఎందుకు వేస్తారు? అసలు బలి అంటే ఏమిటి?
పూజకు సంకల్పం ఎందుకు చెప్పాలి?
షోడశోపచార పూజ అంటే ఏమిటి?
పూజ చివరలో మంత్రపుష్పం ఎందుకు చెబుతారు?

ఇంకా ఎన్నో సందేహాలు...
అన్నిటికీ సమగ్రమైన, సశాస్త్రీయమైన సమాధానం చెప్పే గ్రంథం




కాపీలకు:
9494875959,
949387595


## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
**ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి
కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**

**4000 రూపాయల బహుమతులు**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.











**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**

కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.


- మొదటి బహుమతి- **రూ.500/-లు**
- రెండవ బహుమతి- **రూ.300/-లు**
- మూడవ బహుమతి- **రూ.200/-లు**







కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా బహుమతులే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*తెలుగు అధ్యాపకుడు, కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ*
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

**(గత సంచిక తరువాయి)**

**ఒ**కేసారి రెండు మూడు పిడుగులు పడిన శబ్దం వినిపించడంతో వాలు కుర్చీలో కునుకుతీస్తున్న వాడిని ఒక్కసారిగా అదిరిపడి కళ్ళు తెరిచాను.

తీరాచూస్తే... ఎదురుగా క్లోజప్ కంపెనీ యాడ్‌లో నవ్వుతున్న ఆర్టిస్ట్ మాదిరిగా... నోరంతా తెరచి నవ్వుతున్న ప్రసాదరావు కనిపించాడు. విషయం అర్థమైంది...

ఇదంతా ప్రకృతి బీభత్సాన్ని మించిన అత గాడి చిరునవ్వు శబ్దమని.

"ఏమిటయ్యా ఈ అఘాయిత్యం!... పడు కున్నాను కదా!... ఆ మాత్రం ఇంగితం ఉండొద్దూ? ఏమిటా సకిలింపు?" అన్నాను చిరాకుగా.


"అలా కోప్పడకండి మాస్టారూ! స్కూల్ నుంచి అలసిపోయి వచ్చిన ఎల్.కె.జి పిల్లాడు పడుకున్నట్లు అనిపించింది మిమ్మల్ని చూస్తే... అందుకే అలా..."

"అఘోరించావులే... వచ్చిన పనేమిటి? అదైనా మనుషులు మాట్లాడుకునే శబ్దంతో చెప్పు!" అన్నాను చిరాకుగా.

"మా తెలుగు మాస్టారు మాట్లాడే ప్రతి మాటా చమత్కారమే..." అంటూ విచిత్రంగా మెలికలు తిరుగుతూ ఇంకోసారి సకిలించాడు ప్రసాదరావు.

అదేదో సినిమాలో బాబూమోహన్ వేసిన బిచ్చగాడి పాత్ర గుర్తొచ్చింది ప్రసాదరావు వాలకం, మాటతీరు చూస్తుంటే.

"సరే కానీ మాస్టారూ... ఇంతకీ నేనెందుకు వచ్చానంటే, మన ఊళ్ళోని శనీశ్వరుడి గుడిని ఈమధ్య బాగుచేయించాం... ఊళ్ళో పెద్దలంతా తోచినంత సహాయం చేయడంతో మౌళిక సదుపాయాలు కూడా బాగా అభివృద్ధి చేసాం. ఉత్సవాల్లో వాహనాలు, ఇతర వస్తువులు జాగ్రత్త చేయడం కోసం భాండాగారం కట్టాం. గుడికి తూర్పు పక్కన ఉన్న భూతగాదాలన్నీ పెద్దమనుషుల ద్వారా ఒప్పందం చేయించి, పరిష్కరించాం... ఈ మధ్య పర్యాటకులు కూడా గుడికి బాగా వస్తు న్నారు. రేపు శనిత్రయోదశి కదా! స్వామి వారికి రేపు పాలాభిషేకం చేస్తున్నాం. భానోదయం సమయానికి మీరు రావాలని కోరిక... రేపటి




ఉభయం మీదే..." అంటూ ఒకేసారి పది గుర్రాలు సకిలించినట్లు నవ్వాడు ప్రసాదరావు.

"ఉభయం కడతాను కానీ ఆ నవ్వాపవయ్యా బాబూ!... నేను దాదాపు బతిమాలినంత పని చేసా! ఈ విచిత్రమైన అరుపులు విని రత్నం కూడా వంటిట్లోనుంచి గాబరాగా పరిగెత్తుతూ వచ్చింది.

"మాస్టారూ... ఉభయం... " అంటూ ఇంకోసారి సకిలించే ప్రయత్నం చేసాడు ప్రసాదరావు.

అనుభవం కలిగింది కాబట్టి నిమిషంలో పరిస్థితి అర్థం చేసుకుని, ప్రసాదరావును చూసి జాలిగా నవ్వి, వంటింట్లోకి దారితీసింది రత్నం.

"కడతానులే కానీ...ముందు ఈ సంగతి తేల్చు! మీరంతా కలిసి బాగుచేయించింది శనీశ్వరుడి

ఆలయం అన్నావు కదా! అది చాలా తప్పు. అంటే ఆలయం కట్టడం తప్పని కాదు. అలా పలకడం తప్పని అంటున్నా! **శనీశ్వరుడు** కాదు... **శనైశ్చరుడు** అనాలి. ఇక నువ్వు మౌళిక సదుపాయాలు ఏమాత్రం అభివృద్ధి చేయలేవు. ఎందుకంటే.... **మౌళిక** అనకూడదు. **మౌలిక** అని మాత్రమే అనాలి. ఇక, మీరంతా కలసి కట్టించింది **భాండాగారం** కాదయ్యా... దాన్ని **భండారం** అనాలి...


...ఇంకా ఏమిటీ? భూతగాదాలు పరిష్కరిం చావా? నీ మొహం పరిష్కరించావు!... **భూతగాదా** అనకూడదు... **భూ వివాదం** అనాలి. భూమి అనేది సంస్కృత పదం. తగాదా అనేది హిందుస్తానీ భాష నుంచి వచ్చిన తెలుగు పదం. దీన్ని అన్యదేశ్యం అంటారు.

ఇక పెరిగింది నీ పైత్యం తప్పు... **పర్యాట కులు** కానే కాదు. **పర్యటకులు** అని మాత్రమే పలకాలి. అలాగే, **పర్యాటన** అని కూడా అన కూడదు. **పర్యటన,** పర్యటకులు అనే పలకాలి. ఆ పదాలు అలాగే రాయాలి.

అన్నిటికన్నా ఘోరం ఏమిటంటే....

**ఆలయంలో మీరు చేసేది పాలాభిషేకం కానే కాదు.**

అసలీపదం ఎలా పుట్టిందో కానీ పత్రికల్లో, రాజకీయ నాయకుల ప్రచారాల్లో ఈ పదం వాడీవాడీ జనాల్ని చంపేస్తున్నారు. పాలాభి షేకం ఏమిటయ్యా నీ మొహం మండ!...




ఇప్పటికే తెలుగుతల్లి చిక్కి శల్యమైపోతోంది. ఇంకా మీ విచిత్రమైన, సంకరమైన పదాల వినియోగంతో ఆ తల్లి తల్లడిల్లిపోతోంది... పాలాభిషేకం చెయ్యడం ఏమిటీ... మీ పాలన్నీ పిల్లి తాగిపోను. పాలు అనేది తెలుగు పదం! అభిషేకం అనేది సంస్కృత పదం. తెలుగు, సంస్కృత పదాలకు సంధి కలపడం ఏమి టయ్యా? ఏమిటీ దౌర్భాగ్యం?!... రాజకీయ నాయకుల విగ్రహాలకీ, సినిమా హీరోల ఫోటో లకీ పాలాభిషేకాలంటూ ఏం హడావిడి చేస్తు న్నారయ్యా? బిందెలతో పాలు పోసేయడం... మర్నాడు పత్రికల్లో ఫలానా నాయకుడి విగ్ర హానికి పాలాభిషేకం అంటూ ఫొటోలు, వార్త లూను! చేసే వాడికి తెలియదు. వార్త రాసే వాడికి తెలియదు. చివరకు చదివే వాడిక్కూడా తెలియదు... ఖర్మ కాలిపోను! **పాలాభిషేకం** కాదయ్యా... దాన్ని **క్షీరాభిషేకం** అనాలి.

ఇక చివరగా నేను చెప్పేదేమిటంటే రేపు భానోదయం సమయానికి నేను రాలేను గాక రాలేను. ఎందుకంటే **భానోదయం** అనే పదం తప్పు. **భానూదయం** అని మాత్రమే పలకాలి. అలాగే రాయాలి కూడా!..."

ఇంకా ఏదో చెప్పబోతుంటే...

ప్రసాదరావు అప్పటికే గొంతు తడారిపోయి బిక్కచూపులు చూస్తున్నట్లు అనిపించింది.


ఎడారిలో నీటి చెలమ కోసం ఆత్రంగా వెతుకుతున్న ప్రాణి మాదిరిగా... దేనికోసమో వెతుకుతున్న తొందర ఆ ప్రాణి ముఖంలో కనిపించింది.


"మాస్టారూ... రేపని కాదు... అసలెప్పటికీ మీరు గుడికి రావద్దు. ఇలా మీరు వ్యాకరణం అనీ, సంధులనీ అక్కడికి వచ్చే భక్తులక్కూడా ఉపన్యాసాలు చెబితే... గుడి ఎడారైపోతుంది మాస్టారూ! మీరు రావద్దు మాస్టారూ రావద్దు!" అంటూ కాళ్ళమీద పడబోయాడు.

ప్రాణప్రదంగా ప్రేమించిన ప్రియుడు తన ప్రేమను తిరస్కరించడంతో పరుగెత్తుకుంటూ వచ్చి, డబల్‌కాట్ బెడ్ మీద పడి... తలగడల్ని కన్నీటితో తడిపేస్తున్న టీవీ సీరియల్ కథా నాయిక గుర్తొచ్చింది... అతగాడి పరిస్థితి చూస్తుంటే.

"కాళ్ళ మీదా వేళ్ళ మీదా పడి ఏ ప్రయో జనం లేదు కానీ... కాస్త ఈ నిమ్మకాయ నీళ్ళు తాగండి. కళ్ళు తిరగడం తగ్గి, ఓపిక వస్తుంది. నెమ్మదిగా లేచి ఇంటి దారి పట్టండి!" అంటూ ప్రసాదరావు చేతికి గ్లాసు అందించింది రత్నం.

**(సశేషం)**





కథ-కథనం

యండమూరి వీరేంద్రనాథ్

యర్రంశెట్టి శాయి



# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగపిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండో వాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! బ్యాంకులో పని. సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. ఒకరోజు సాత్వికరావుని అరెస్టు చేయడానికి పోలీసులు బ్యాంకుకి వస్తారు. **ఆ తర్వాత...**

**"మీరంటే మీరని కాదు. మీ బ్యాంక్!"**

**"ఐసీ... ఇంతకూ ఇప్పుడేం చేద్దామంటారు?"**

**"అతనిని మాకు అప్పజెప్తే మేము తీసుకెళతాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.**

**"వీల్లేదు. ఇతను డ్యూటీలో ఉన్నాడు."**

**"కానీ నేరం చేశాడు!"**

**"మాది బ్యాంకు. అసలే పదిమంది పనికి అయిదుగురు స్టాఫ్‌ని ఇస్తారు."**

**"మాది పోలీసు స్టేషను. పదిమంది పనికి ఏడుగుర్ని ఇచ్చి అయిదుగుర్ని మంత్రుల బందోబస్తుకి పంపుతారు."**

"అతనికి నేను శలవు ఇవ్వలేను. మీరు తీసుకెళ్లటానికి వీల్లేదు."

"పోలీసులకి అడ్డు తగులుతున్నాడు. ఈయన్ని కూడా లోపలేయండ్రా!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇద్దరు కానిస్టేబుల్స్ ఆయన్ని లాక్కెళ్ళి వ్యాన్‌లో పడేశారు. మేనేజరంటే పడని సబ్-మేనేజర్ 'టీ పార్టీ' ఏర్పాటు చేయటానికి సన్నాహాలు ప్రారంభించాడు.

"మా మానేజర్ మంచివారు సార్... ఇదన్యాయం... అక్రమం. ఎవడో డూప్లికేట్ ఇదంతా చేస్తున్నాడని నా అనుమానం... ఒక రాధ ఇద్దరు కృష్ణులు..." ఏడుపు ముఖంతో ఏదో చెప్పబోయాడు సాత్విక్.

రాధ కల్పించుకుని "ఆ సినిమా నేను కూడా చూశాను. ఆ రెండు వేషాలూ ఒకడే వేసినట్టు చివర్లో తెలుస్తుంది." అన్నది.

"ఈ దేశాన్ని సినిమాలూ, నవలలూ నాశనం చేసేస్తున్నాయి. కమాన్ మిస్టర్ సాత్వికరావ్. నీ ఆటకట్టు!"

సాత్వికరావు దీనంగా లేచి నిలబడ్డాడు.

అతడి వైపు చూస్తూంటే సడెన్‌గా ఏదో ఆలోచన వచ్చినట్టూ ఇన్‌స్పెక్టర్ "ఇద్దరూ పెళ్ళి చేసేసుకోండి, ప్రాబ్లం సాల్వ్ అయిపోతుంది!" అన్నాడు.

రాధతో పాటూ సాత్వికరావు కూడా కంగారు పడ్డాడు.

"అవును! మీకు తెలుసో లేదో... మేమీ మధ్య మిగతా డ్యూటీలన్నీ మానేసి, అందరికీ పెళ్ళిళ్ళు చేస్తున్నాం..." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏమిటీ? పెళ్ళా?" ఆశ్చర్యంగా అడిగాడు సాత్వికరావు.

"అవును! తప్పు చేసిన ఎవరికయినా పెళ్ళే సరైన శిక్ష అని నేను బలంగా నమ్ముతాను... మా పోలీస్‌స్టేషన్‌లో రోజుకో పెళ్ళి టార్గెట్‌గా పెట్టుకున్నాం... ఎల్లుండి తారీఖు ఖాళీగా ఉంది. అందులో మీ పెళ్ళి రాసేయనా?"

"అక్కర్లేదు!" అందా యువతి కోపంగా.

"చేసుకోక చేసుకోక ఇలాంటి రౌడీనా చేసుకునేది?"

"నన్ను 'రౌడీ' అన్నారంటే బాగుండదండీ... మా బ్యాంకులో అందరూ... నా అంత మంచివాడు లేడని అంటూంటారు!" పౌరుషంగా అన్నాడు సాత్వికరావు.

"అయితే ఇక్కడ అందరూ మిమ్మల్ని మించిన రౌడీ మూక అయ్యుండాలి!" అంది రాధ.

"ష్..." అన్నాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

"...పెళ్లి తరువాత ఎలాగూ తప్పదు. ఇప్పుడే గొడవ లెందుకు? నా మాట విని పెళ్ళికి ఒప్పుకోండి. రికార్డ్స్‌లో ఎల్లుండి డేట్ రాసేస్తాను. మా కమిషనర్‌గారు కూడా వస్తారు పెళ్ళికి. పది రోజుల్లో కొత్త ప్రభుత్వం వస్తుంది. కొత్త దంపతులకి శోభనం ఫ్రీ... అని ఎన్నికల వాగ్దానం

చేసింది కదా! మీ జంటకు అది కూడా రికమెండ్ చేస్తాం!"

"పెళ్లి చేసుకుంటే శోభనం ఫ్రీ ఏమిటి?" అని జనంలోంచి ఎవరో అరిచారు.

పక్కనున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ చెవిలో రహస్యంగా "పెళ్లి చేసుకుంటే మూడు రోజులు ఎడారిలో రిసార్టు ఫ్రీ' అని చెప్పింది సార్" అన్నాడు.

"అవును. నేను రికమెండు చేసి థార్ ఎడారిలో రిసార్ట్ ఇప్పిస్తాను."

"పెళ్ళీ లేదు. శోభనం లేదు!" అరిచింది రాధ.

"నాక్కూడా!" అన్నాడు సాత్విక్.

"నాకు రెండోది ఒకే" అని జనంలోంచి ఎవడో అరిచాడు.

"అరెస్ట్ ఆల్-దీస్ ఫెలోస్!" అని పోలీసులతో చెప్పి, ఆ యువతి వైపు తిరిగి "నేను చెప్పిన పెళ్లి విషయం ఇంకోసారి ఆలోచించుకోండి. ఒప్పుకుంటే నాకు ఫోన్ చేయండి మిస్!" అన్నాడు.

ఆ తరువాత వెళ్ళబోతూ ఆగి "సాయంత్రం స్టేషన్ కి వచ్చి కలవండి" అన్నాడు స్వరం తగ్గించి.

✦✦✦

సరస్వతీదేవి దిగులుగా నెత్తిన చేయి పెట్టుకుంది.

"రాధా సాత్విక్‌ల జోడీ బాగుంటుందని ఎంతో ముచ్చట పడ్డాను. వాళ్ళిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అవుతారనీ... ఇంద్రసతి తిక్క కుదురుతుందనీ అనుకున్నాను... కానీ ఆ ఆనందరావు వల్ల ఈ సాత్విక రావు, రాధల మధ్య కలహం మొదలయింది. ఇప్పుడెలా?"

బ్రహ్మ ఆమె మీద జాలి పడి... "ఒకే ఒక్క మార్గముంది!" అన్నాడు సృష్టి ఆపకుండానే.

"ఏమిటి నాథా అది?" ఆత్రుతగా అడిగింది.

"మనం ఈ పని మరొకరికి వప్పగించటం"

"అంటే? నాకర్థం కాలేదు."

"మనం వయో వృద్ధులం. మనకి ఎన్నో పనులు ఉన్నాయి. దీనికి నిరంతర నిఘా అవసరం. అందుకని ఈ వ్యవహారం ఇంకెవరికైనా అప్పగిస్తే మంచిదని నా ఉద్దేశ్యం."

"ఎవరికీ?"


"రతీ మన్మథులకి! ఇటువంటి పనులు వారే చెయ్యగలరు... పైగా ప్రస్తుతం వారిద్దరూ చాలా ఖాళీగా ఉన్నారు కూడా!"

'నిజమే' అన్నట్టూ తలూపింది ఆమె.

బ్రహ్మ పిలుపుపై రతీ మన్మథులు వాయువేగంతో అక్కడికి చేరుకున్నారు.

"ఎందుకు ఇంత అకస్మాత్తుగా రమ్మని పిలిపించారు అన్నయ్యా?"






అని అడిగాడు విష్ణు పుత్రుడు.

"మీరు మాకో సాయం చెయ్యాలని అభ్యర్థి స్తున్నాను." అన్నాడు బ్రహ్మ.

"మీరు మమ్మల్ని అభ్యర్థించటమా? ఆజ్ఞా పించండి బావగారూ!" అన్నది రతీదేవి.

ఏమి చెయ్యాలో చెప్పింది సరస్వతి.

శ్రద్ధగా విన్నారు దంపతులు.

"ఈ పనులు చెయ్యటానికి మీకు కొన్ని శక్తులు ప్రసాదిస్తున్నాను... అయితే ఒక్క విషయం. శారదా పార్వతుల సంవాదం మన తండ్రిగారికి నచ్చకపోవచ్చు... ఈ విషయం ఆయనకి తెలియకూడదు!" అన్నాడు బ్రహ్మ.

"అవును! నాన్నగారికి ఇలాంటి విషయాలు నచ్చవు!" అన్నాడు చెరుకువిల్లు సర్దుకుంటూ మన్మథుడు.

✦✦✦

రతీ మన్మథులు భూలోకానికి వెళ్తున్నట్టు కల వచ్చి హంసతూలికా తల్పం మీద పడు కున్న ఇంద్రసతి ఉలిక్కిపడి లేచింది.

పక్కన ఒక గొంతు– "ప్రియా" అని వినిపిం చింది. అంత చనువుగా తనని ప్రియా అని అర్ధరాత్రి పిలిచేది ఎవరని కంగారు పడి చూస్తే... పక్కన మొగుడు నిద్రలో 'ప్రియ... ప్రియా' అని కలవరించటం వినపడి అరచేత్తో ఒకటిచ్చింది.

ఇంద్రుడు అదిరిపడి లేచి "ఏమిటి శచీ! ఏం జరిగింది?" అన్నాడు.

"ఉన్నవాళ్ళు చాలకనా ఇంకోదాన్ని కొంప మీదకు తెస్తున్నారు? ఎవర్ని ప్రియా ప్రియా అంటున్నారు?" అంది మండిపడుతూ.

ఇంద్రుడు గట్టిగా నవ్వేసి– "నువ్వే కలలో కొచ్చావే పిచ్చిదానా!" అన్నాడు.

"ఏదీ ఒట్టెయ్యండి!"

"ఏమని?"

"నాతో తప్ప ఇంకే అతివతోనూ నిద్రించ లేదని దేవుని మీద ఒట్టు వెయ్యండి!" అంటూ చెయ్యి ముందుకు సాచింది.

(మన్మథుడు బ్రహ్మ కొడుకని కొన్ని చోట్ల, విష్ణు కుమారుడని మరి కొన్ని చోట్ల ఉన్నది. దయ చేసి దీనిపై చర్చ వద్దు.)

"నీతో తప్ప నేను ఇంకెవరితోనూ నిద్రించ లేదు. సకలచర తప్పొప్పుల నిర్ణయాధికారి, పాపుల మదమణిచే న్యాయమూర్తి... ఎవరి దగ్గర అబద్ధం చెప్పి తప్పించుకోలేమో ఆ సమవర్తీ, యమధర్మరాజు మీద ఒట్టు వేసి చెపుతున్నాను... నేను ఇంకే మగువ పక్కనా నిదురించలేదు!" అంటూ ఆమె చేతిలో చెయ్యి వేశాడు.

అందరి భార్యల్లాగే అతని మాటలపై నమ్మకం కలిగింది. సంతృప్తి చెంది– "సరే! పదండి. మనం త్వరగా వెళ్ళాలి!" అంది.


ఆశ్చర్యంగా "అర్ధరాత్రి ఎక్కడికి?" అని అడిగాడు.


"భూలోకానికి. వెంటనే వెళ్ళకపోతే మన పరువూ ప్రతిష్ట మంటగలిసి పోతాయి. ఆ జంటను ఎలాగైనా మనం విడదీయాలి."

ఇంద్రుడు తల గోక్కున్నాడు.

"పోనీలేవే. సరస్వతి గెలిస్తే గెలిచింది.మనం మాట్లాడకుండా ఊరుకోవటం మంచిది. అవతల బ్రహ్మమో నాకు మంచి స్నేహితుడు." అన్నాడు.

"సిగ్గు లేకపోతే సరి... ఆ సంగతి పార్వతికి






వాగ్దానం చేసే ముందు ఆలోచించుకోవాలి. పదండి ముందు" అని అరిచింది.

ఇంద్రుడు బద్ధకంగా లేచి నిలబడ్డాడు. తయారవటానికి ఆమె లోపలికి వెళ్ళగానే పక్కనే చిత్రగుప్తుడు ప్రత్యక్షం అయ్యాడు.

ఇంద్రుడు అదిరిపడి–

"ఏమి గుప్తా!.. వేళకాని వేళలో ఇలా వచ్చావు?" అన్నాడు.

ఎప్పుడు ప్రశాంతంగా ఉండే చిత్రగుప్తుడు కఠినంగా– "నిన్ను మా రారాజు వెంటనే యమలోకానికి తీసుకురమ్మన్నాడు!" అన్నాడు.

ఇంద్రుడు భయపడుతూవెళ్ళాడు.


"ఇంద్రా!" కటువుగా గద్దించాడు యముడు.

"...గత అయిదు నెలల్లో కనీసం అరవై మందితో స్వర్గంలో వివిధ ఉద్యానవనాలలో విహరించావు. అపురూప సౌందర్యవంతులైన అప్సరసలను భూలోకానికి విహారయాత్రలకి తీసుకెళ్ళావు. నీవేమో నీ భార్య దగ్గర, ఆమెతో తప్ప మరెవరితోనూ నిదురించలేదని ఒట్టు వేశావ్! అదీ పైగా నా మీద! ఈ కారణంగా నేను నిన్ను సలసలా కాగే నూనెలో వేసి ఎందుకు శిక్షించకూడదో చెప్పు" అని కోపంగా అన్నాడు.

ఇంద్రుడు చేతులు జోడించి– "సమవర్తీ! నీ మీద ఒట్టు వేసి అబద్ధం చెప్పగల ధైర్యవంతుడినా నేను? పాపులను దండించే విషయంలో నిను మించినవాడే లేడని, శ్రీ కృష్ణుడంతడి వాడే భగవద్గీత విభూతి యోగంలో తనని నీతో పోల్చుకున్నాడు. అంతటి గొప్పవాడివైన నీ మీద ఒట్టు వేసి అబద్ధం చెప్పటమా! పుట్టగతులు ఉండవు!" అన్నాడు.

"కానీ నువ్వు..."

"అవును సూర్యకుమారా! భార్య పక్కన తప్ప నేను ఇంకెక్కడా నిదురించలేదు. అందుకే ధైర్యంగా ఒట్టు వేశాను!" అంటూ లేచి నమస్కరించాడు. విషయం అర్థమై యముడు వీడ్కోలు పలికాడు. అర్థం కాని చిత్రగుప్తుడు తెల్ల మొహం వేశాడు.




✦✦✦

మొన్నటి సంఘటనకి సాత్వికరావు మనసంతా పాడయింది.

అతడు ఆంజనేయ భక్తుడు. తనని పోలీసులు ఓ రోజంతా లాకప్‌లో పెట్టటం, రాధని అల్లరి పెట్టింది తను కాదనీ తనకి రాధ ఎవరో అస్సలు తెలీదనీ ఎంత చెప్పినా ఎవరూ నమ్మకపోవటం, ఆ తరువాత రాధకు తను క్షమాపణ పత్రం రాసివ్వాల్సి రావటం... ఈ గొడవలతో రాత్రంతా నిద్ర పట్టలేదు.

తెల్లవారురూమునే లేచి స్నానం కానిచ్చి గుడికి బయలు దేరాడు.

✦✦✦


ఇరవై మిలియన్ సంవత్సరాల క్రితం, అప్పుడప్పుడే తెలివితేటలు సంతరించుకుంటున్న మనిషికి, తెలివితో పాటూ (జంతువులకి లేని) ఆశ, కోరిక, కీర్తి కాంక్ష, సౌఖ్యాపేక్ష, మానసిక బాధ, అసూయ, దుఖం... అన్నిటికన్నా ముఖ్యంగా 'భయం' మొదలయ్యాయి.

ప్రపంచంలో అందరూ స్ట్రాంగ్‌గా, కష్టాలకు క్రుంగిపోకుండా, కోపద్వేషాలకు అతీతంగా ఉండరు. ఉండలేరు. ఆ సమయంలో ప్రకృతి మనిషికి పరిచయం చేసిన గొప్ప కాన్సెప్ట్ 'భగవంతుడు'.

వర్షంలో, మంటలో, సూర్యుడిలో దేవుణ్ణి చూశాడు! భగవంతుడిపై ఆధారపడటం తెలుసుకున్నాడు. జ్ఞానులు 'పాపభీతి' ని సృష్టించారు. నిజాయితీగా ఉండటం నేర్చుకున్నాడు. ఆ విధంగా చూస్తే, భగవంతుడు మానవ జాతికి ఇచ్చిన గొప్ప వరం 'తనపై నమ్మకం'!

దేవుడంటే ధైర్యం. దేవుడంటే భక్తి. నమ్మిన మనిషికి భక్తికి మించిన తృప్తి మరేదీ లేదు.

"ఇదంతా భగవంతుడి వల్లే" అనుకుంటే కష్టాల వల్ల వచ్చే దుఃఖం చాలా వరకూ ఉపశమనమిస్తుంది. "అంతా భగవంతుడే చేశాడు" అనుకుంటే ఇతరుల మీద 'కోపం' 'ద్వేషం' కలగవు. తన నష్టాలకు ఇతరులను అకారణంగా నిందించటం ఉండదు.




ఈ కారణం వల్లనే రాధ పట్ల అతనికి కోపం రాలేదు.

తను ఏదో అపచారం చేయబట్టే దేవుడు తనకీ శిక్ష వేశాడనుకున్నాడు. కానీ తనేం అపచారం చేశాడో తెలియలేదు. తీవ్రంగా ఆలోచిస్తూ నడవసాగాడు.

హఠాత్తుగా గుర్తుకొచ్చేసింది!

జీవితాంతం బ్రహ్మచారిగా ఉంటాననీ... అప్సరస లాంటి ఆడపిల్లను చూసినా చలించననీ ఆంజనేయస్వామికి ప్రామిస్ చేశాడు. కానీ మొన్న సాయంత్రం బ్యాంక్‌లో రాధ అందాన్నీ, వంటి ఒంపులనీ చూసేసరికి మనసు కాస్త చలించిన మాట నిజమే!

రాములోరి గుడి పక్కనే ఆంజనేయుని గుడి. ఆ ప్రశాంత ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే హృదయం సేద తీరింది. గర్భగుడిలో నిండు విగ్రహాన్ని చూడగానే మనసంతా భక్తి భావంతో నిండిపోయింది.

"అపచారం జరిగిపోయింది స్వామీ... క్షమించు!" అంటూ చేతులు జోడించాడు.

స్వామి కోపంగా ఉన్నట్లు కనబడింది.

"స్వామీ! ఆ రాధెవరో మరీ బాగుంది... అందుకని కొంచెం 'ఇది' గా అనిపించింది. ఇంకోసారి ఆమె కనిపించినా... అటువంక చూడను!" అంటూ చెంపలు వేసుకున్నాడు.

అయినా ఆంజనేయుని ముఖంలో ఇంకా కోపమే తాండవం చేస్తోంది.

"స్వామీ! నన్ను క్షమించవా? సరే అయితే." అంటూ గర్భగుడి నుంచి ఆవేశంగా బయటకు వచ్చాడు.

భక్త తుకారాం రిలీజయిన కొత్త రోజులు.

వడివడిగా ధ్వజస్థంభం దగ్గరకు వెళ్లి గంట కొడుతూ, 'ఉన్నావా... అసలున్నావా..' లెవెల్లో దీనమైన కోపంతో (!) "నేనే నీ భక్తుడనయితే, నా భుక్తే నీ పై భక్తి అయితే, నాపై నీకనురక్తి ఉంటే, చురకత్తి లాంటి నా భక్తిలో నర్తించే శక్తి ఉంటే... పొంగాలి సప్త సముద్రాలు... రావాలి భూకంపాలు. మునగాలి ముల్లోకాలూ..." అని పాట ఎత్తుకున్నాడు.

తనతో పోటీకి వచ్చినదెవరా అని నారదుడు కంగారు పడి క్రిందికి చూశాడు.

అంజనీపుత్రుని గుడిలోంచి అలలు అలలుగా వస్తోన్న ఆ అపస్వరాల పాట విని... సరస్వతి అలజడి పడి మగని వైపు చూసింది.

"ఇదెక్కడి గొడవే? మరీ ఇంత అమాయకుని ఎలా సృష్టించావు?" అన్నాడు బ్రహ్మ చిరాగ్గా!

"నాకేం తెలుసండీ?.. ముగ్గురు అందగాళ్ళలో ఒకడు మేధావీ, రెండోవాడు అమాయకుడూ, మూడోవాడు చురుకైనవాడూ అయితే గొప్పగా ఉంటుందనుకున్నాను. తీరా చూస్తే మేధావికి చిన్న వయసులోనే జుట్టూడిపోయింది. ఈ అమాయక భక్తుడు సప్త సముద్రాలూ పొంగాలి అంటున్నాడు. చురుకైనవాడు పెళ్ళి ఆలోచన లేకుండా రంగేళి రాజా అయిపోయాడు." అంది దిగులుగా. **(సశేషం)**



సరికొత్త సరదా శీర్షిక

# వాక్చిత్రం

సుధామ-9849297958

## బర్లేరియా క్రిస్టాటా!



వచ్చిన చిక్కే ఇది... పదం ఒక్కటే! కానీ భాషబట్టి భావం మారి పోతూంటుంది. మనం మాట్లాడే తెలుగులో వాటిని కలిపేసి ఇప్పటికే టీవీ యాంకర్లు 'కాల్చేస్తున్నారు' 'మీరు మండే రోజు' అంటూ కాల్, మండే లాంటి ఇంగ్లీషు పదాల సంకర సంభాషణతో ఊదరగొట్టి నవ్వులపాలు చేస్తూనే వున్నారు మనల్ని. ఏం చేస్తాం? ఏం చెయ్యలే మన్న మాటేగా! అలవాటు పడిపోయి అర్థం చేసుకోక ఛస్తామా!

అన్నట్లు రెండు నెలలకు సంవత్సరంలో పూలతో సంబంధం ఉంది. అవి ఏప్రిల్, డిసెంబరు. సరే! 'డిసెంబర్ పూలు' అంటాం గానీ ఏప్రెల్ ఫూల్ ఏమిటంటారా? 'ఫూల్' అంటే హిందీలో పువ్వులు. ఇంగ్లీషులో మూర్ఖుడు. కానీ 'డిసెంబర్ పూలు' మాత్రమే ఎవరికయినా పూలే! నయాపూల్, పురానాపూల్ అని హైదరాబాద్‌లో అంటే ఆ 'పూల్' మటుకు వంతెన.

అసలు డిసెంబర్‌లో పూస్తాయి కనుక డిసెంబర్ పూలు అని పేరొచ్చింది అనుకుంటే... మరి ఇతర నెలల్లో పూసే పూలకు ఆ నెలల పేర్లు ఎందుకు లేవని అడక్కండి! ఈ డిసెంబర్ పూలు మటుకు నిజంగా ప్రత్యేకమైనవే! రంగుల ఆకర్షణ వీటి సొంతం. విశేషం ఏమిటంటే వీటికి వాసన మటుకు వుండదు.

"వాసన లేని పూలు, బంధువర్గము లేని పురంబు..." కొరగానివి అని పెమ్మయ సింగధీమణి అని వుండచ్చు గానీ అన్నిటికీ వాసనాబలం వుండాలన్న నియమం ఏమీ లేదుస్మీ!

వాసనలో సువాసనలు, దుర్వాసనలు వుంటాయి గానీ రంగుల్లో మాత్రం ఆకర్షణీయతే వుంటుంది. ఇంద్రధనుస్సుకు మనం వాసన ఏమీ కోరుకోము కదా!

'చూడకనుల కింపు' అనేది లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌కు నేషనల్ హైవే లాంటిది. చూడగానే ఆకర్షిస్తేనే దేని దగ్గరకైనా చేరుతారు. అందుకే వస్తువుల ఉత్పత్తిలో వాటి నాణ్యత మాట ఎలా ఉన్నా దాని ప్యాకింగ్ ఆకర్షించేలా చేస్తారు వర్తకులు.

'పైన పటారం-లోన లొటారం' అయినా పటారమే పట్టుకుంటుంది. అందుకే పత్రిక ముఖచిత్రం ముందు అందంగా వుండి ఆకర్షిస్తుంది.

ఇంతకీ డిసెంబర్ పూలు గురించి కదూ మొదలెట్టింది. ఊదారంగు, బంగారువర్ణం, తెలుపు, లేత గులాబీ రంగుల్లో కనిపించే ఈ పూలు నవంబర్ నెల చివరి నుండే చిగురులు తొడిగి గట్లవెంట కూడా విరబూస్తాయి సుమా!... నిజానికి చాలా చెట్లు, పూలు సూర్యకాంతి లేకపోతే చచ్చి పూరుకుంటాయి. కానీ తక్కువ సూర్యకాంతిలో వికసించే ఈ పూలు ఆకర్షణీయతలో ప్రత్యేకమైనవి.

ఇప్పుడంటే అసలు పూలు పెట్టుకునే ఆడవాళ్ళే అందునా యువతులే కనిపించడం లేదు గానీ ఈ డిసెంబరు పూలు తలలో తురుముకుని ఒకప్పుడు అమ్మాయిలు అబ్బాయిల మనసులు దోచేసేవారు. పూల వాసన లేకపోయినా ఆ అమ్మాయి వాసనా బలం చాలదూ... వారి గుండెల్ని ఊపేయడానికి! 'బర్లేరియా క్రిస్టాటా' అనేది ఈ పూల బొటానికల్ నేమ్. పిల్లి అంటే మార్జాలం అన్నట్లు అదెందుకు గానీ హాయిగా 'డిసెంబర్ పూలు' అంటేనే బెస్ట్ కదా! గొబ్బిపూలు, పెద్ద గోరింట అనే కుటుంబానికి చెందిందే ఇది అని కొందరంటారు.




మొక్కలకు ఔషధగుణాల గురించి మీకు తెలుసనుకోండి!... కానీ ఈ డిసెంబర్ పూలకు థాయ్‌లాండ్‌లో గొప్ప ఔషధ విలువలు గలదానిగా బోలెడు విలువ. అమ్మాయిల జడకూ, దేవుడి మెడకూ అలంకారంగా డిసెంబర్ పూలమాలలు ఎంత అందమో రక్తశుద్ధికి, మూత్ర సంబంధిత వ్యాధుల నివారణకు అంత ఉపయుక్తం.

డిసెంబర్ పూలగింజలు పాము కాటుకు విరుగుడుగా వాడతారు. కాలిన గాయా లకు వాపు తగ్గడానికి ఈ పూల ఆకురసాన్ని రాస్తారు.

సంవత్సరాంతం డిసెంబర్‌లో ఇంత అందాన్ని, ఆరోగ్యాన్నీ అందించే డిసెంబర్ పూలు ఏ 'ఫూల్' నిరసించగలడు చెప్పండి? వాసన లేదని త్రోసి రాజనకుండా అందానికీ ఆరోగ్యానికీ మధ్య 'నయాపూల్' (వంతెన) నిర్మించుకుని ఆనందం పొందే పూలు.... 'డిసెంబర్ పూలు'.

నిజమైన 'హాస్యానందం' అందించే పూలు సుమా!

మంచి కార్టూన్లన్నీ 'పుల్' (Pull) చేసి రంగు హంగులు మిళాయించిన డిసెంబర్ సంచిక డిసెంబర్ పూలు లాంటిదే మరి!


"అందం చూడవయా!... ఆనందించవయా...!!

వయా డిసెంబర్ పూలతో హాస్యానందానికి సంవత్సరాంత వీడ్కోలు సంబరం! స్వస్తి.

# గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు

## 2025






**మొదటి బహుమతి**

రూ.3,500/-లు

గెలుపొందిన కార్టూన్.

కార్టూనిస్ట్-దొరశ్రీ




**రెండవ బహుమతి**

రూ.2,500/-లు

గెలుపొందిన కార్టూన్.

కార్టూనిస్ట్-మోహన్ కుమార్



**మూడవ బహుమతి**


రూ.1,500/-లు


గెలుపొందిన కార్టూన్.


కార్టూనిస్ట్- ధీరజ

# ప్రత్యేక జ్యూరీ బహుమతులు పొందిన 5 కార్టూన్లు

## ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి











## యనమండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకటలక్ష్మీ స్మారక పురస్కారం-2024

ప్రముఖ కార్టూనిస్ట్
శ్రీ నాగిశెట్టి గారికి
అభినందన పూర్వక సత్కారం



**గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ విజేతలకు,**
**యనమండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకటలక్ష్మీ స్మారక పురస్కారం-2024 బహుమతి ప్రదాన సభ**

డిశంబర్, 25 వతేదీ, బుధవారం, హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో
సాయంకాలం 6గంటలకు.



# డెగిసాతో గంగాళం

డాక్టర్ దేవులపల్లి పద్మజ
9849692414

**"తిండి...తిండి...తింటూనే తగలడండి..." అనే కేప్షన్‌తో ఓ గ్లోబల్ ఫుడ్ కంపెనీ వారు నిర్వహించిన వంటలక్కల పోటీలో 'ఉత్తమ వంటలక్క' టైటిల్ సాధించిన శ్రీమతి డెగిసా గారిని ముఖాముఖి నిర్వహించడానికి... 'ది గ్రేట్ తప్పేలా' టీవీ స్టూడియోకి సరిగ్గా నాలుగు గంటలకి రమ్మన్నారు, ఆ టీవీ యాజమాన్యం.**

ఎందుకైనా మంచిదని డెగిసా ఓ పావుగంట ముందే స్టూడియోలో రెడీగా ఉంది. చుట్టూ పరికించి చూసింది 'గ్లోఫుకం' నిర్వాహకుల కొరకు! అక్కడ ఎవరూ కనపడడం లేదు. తెలిసిన వారెవరూ కూడా లేరు. మనసులో ఆనందం, ఆందోళన కలగలసిన ఫీలింగ్. ఎలాంటి ప్రశ్నలు వేస్తారో?... ఎలా చెప్పాలి?... రాక రాక వచ్చిన అనుకోని అవకాశం. ఈ ముఖాముఖి గురించి అందరికీ వద్దుగానీ తెలిసిన వర్గం, తెలియని వర్గం వారికి మాత్రమే పంపిస్తాను. ఏదైనా పారితోషికం ఇస్తారా?... ఇవ్వరా?... ఇస్తే ఎంత ఇస్తారు? ఇవ్వక పోతే అడిగేస్తే ఎలా ఉంటుంది? ఇలా అనేక ఆలోచనలు, సందేహాలు.

ఓ గంట తర్వాత...

ఎవరెవరో వస్తున్నారు. విజిటర్స్ రూమ్‌లో కూర్చున్న డెగిసాని చూస్తున్నారు... దాటుకుని ముందు రూమ్‌లోకి వెళ్ళిపోతున్నారు. ఇద్దరు ముగ్గురు మాత్రం ఈమె పేరు, వివరాలు అడిగి తెలుసుకుని వెళ్ళారు.

సాయంత్రం ఆరు గంటలు దాటుతుంటే ఒకాయన వచ్చి...

"ముఖాముఖి కార్యక్రమం చేయడానికి ఆహ్వానించిన డెగిసా మేడమ్ మీరేనా?" అని అడిగాడు.

"అవును!" అన్నట్టు తలాడిస్తూ లేచి నిలబడింది డెగిసా.

"ఓకే" అనేసి లోపలికి వెళ్ళి మరోగంట పోయాక ఆమెని పిలిచాడు.

ఓ రెండు నిమిషాలు నడిచాక స్టూడియోలో షూటింగ్‌రూంలోకి వెళ్ళింది.

ముందు కొన్ని జాగ్రత్తలు చెప్పి, అడిగిన దానికి సూటిగా క్లుప్తమైన వాక్యాలలో సమాధానాలు చెప్పమన్నారు.


సరేనని తలాడించింది.

ఒక నిమిషం నిశ్శబ్దం... చుట్టూ లైట్లు వెలుగుతున్నాయి. వీక్షకుల నుద్దేశించి నమస్కరిస్తూ... "జీ యఫ్ సీ 2024 పోటీలో 'ఉత్తమ వంటలక్క' టైటిల్ పొందిన శ్రీమతి డెగిసా గారితో మా తప్పేలా స్టూడియో ప్రతినిధి గంగాళం, తన ముఖాముఖిలో ఆమె ఈ టైటిల్ సాధించడంలోఎలా స్పందిస్తున్నారో అడిగి తెలుసుకుంటారు. ఓవర్ టూ గంగాళం..." చెప్పింది యాంకరమ్మ.

"నేను గంగాళం!... నమస్కారం డెగిసా మేడమ్. కార్యక్రమానికి స్వాగతం..." అంటూ కూర్చోమని సింహాసనం వంటి ఆసనం చూపించాడు. ప్రతి నమస్కారం చేస్తూ కూర్చుంది డెగిసా.

"మీకు ఈ టైటిల్ గెలిచినట్టు ఫోన్ రాగానే ఎలా ఫీల్ అయ్యారు? మా ప్రేక్షకుల కోసం ..."

"ముందు నమ్మలేదు. ఎవరికని అడిగాను. బటన్ బొబ్బట్లు, జీరా కాజా, ఆవలడ్డూ ఐటెమ్స్ చేసినది మీరేనా? అని అడిగారు. అవునండి నేనే అని చెప్పగానే, అయితే మీకే ఈ టైటిల్ అన్నారు. ఒక్కసారి ఉలిక్కిపడి చాలా చాలా సంతోషం పట్టలేక... వెంటనే మా వారికి చెప్పేసాను. వారు నమ్మలేదేమో మరి, కంగ్రాట్స్ కూడా చెప్పలేదు. నేను కూడా సీరియస్‌గా తీసుకోకుండా, వెంటనే ఫ్రెండ్స్ అందరికీ ఫోన్ చేసి ఈ శుభవార్త చెప్పేసాను. వారి నుండి కూడా నో స్పందన..."




"కంగ్రాట్స్ మేడమ్! తప్పేలా స్టూడియో నుంచి కూడా మీకు అభినందనలు..."

"థేంక్సండీ..."

"మీరు ఇవి చేయడానికి ఏదైనా కోచింగ్ తీసుకున్నారా ఎలా నేర్చుకున్నారు?"

"డాక్టర్ కారాబు గారు వ్రాసిన రచనలు చదివి ప్రయత్నించాను!"

"నైస్! చదువుతూ చేసారా?... ఎన్నిసార్లు ప్రయత్నిస్తే మీకు ఈ విజయం లభించింది?"

"లేదండీ! చేస్తూ కూడా చదివాను. చాలా సార్లు చేస్తేనే ఈ విజయం లభించింది!"

"మధ్య మధ్యలో సందేహాలు వచ్చేవా? మీరు ఆ రచయిత కారాబు గారిని సంప్రదించేవారా?"

"చాలా సందేహాలు వచ్చేవి...అనేకసార్లు వారితో మాట్లాడడానికి ప్రయత్నించా... కానీ అవలేదు!"

"అంటే మీరు ఆధునిక ఏకలవ్యి అనుకోమంటారా?"

"కోవచ్చు! నేను స్క్రిప్ట్ చూసి, ఏకలవ్య గురువు విగ్రహం చూసి నేర్చుకున్నా!"

"ఓకే!... వంటకాలు అంతంత చిన్న సైజ్ చేయడంలో ఇబ్బంది పడ్డారా?"

"ఆ! చాలా విరిగిపోవడం, జారిపోవడం వల్ల ఎక్కువ సమయం తీసుకుంది... సరిఅయిన ఆకారం రావడానికి..."


"కొలతలు, కావలసిన పదార్థాలు ఓసారి ఐటం వారిగా పరిచయం చేస్తారా?"

పోజ్‌లో నిలబడమని చేసి చూపించాడు. ఎక్కడ కేమేరా ఆఫ్ చేస్తున్నారో ఎపుడు ఆన్ చేస్తున్నారో డెగిసాకి తెలీడం లేదు. అలాగే నిలబడింది.

సడన్‌గా ఆ టేబుల్ తిరుగుతూ... తామర రేకులు విచ్చుకొన్నట్టు అందంగా విచ్చుకొని అరనిమిషం తరువాత, తిరుగుతున్న టేబుల్ పై భారీ వెండి పళ్ళేలూ మూడు, వాటిని రకరకాల గులాబీల మధ్య కొంచెం పైకి ఓ గాజు కటోరీ నిండా లడ్డూలు, సింగిల్ స్టాండింగ్ ఆవగింజ, జీరాకాజా, బటన్‌బొబ్బట్లు చూడముచ్చటగా తిరుగు తున్నాయి. లడ్డూ కావాలా నాయనా? పోనీ కాజా తింటావా? బొబ్బట్టు రుచి చూస్తావా అంటూ ఊరిస్తున్నాయి.

ఒక్క నిమిషం డెగిసాకి మనసు మొద్దుబారిపోయింది.

ఏమిటి ఇదంతా నిజమేనా? నేను చేసిన వంటకాలకే ఈ గుర్తింపా? ఎప్పుడూ మాడిపోయిన కూరలు తింటూ భర్త చేత తిట్లు తినడమే అలవాటు. టీవీ చూస్తూ వంట చేయొద్దంటారు. అలా ఎలా కుదురు తుందని తను వాదిస్తుంది.



"తప్పకుండా! ముందుగా బొబ్బట్లకి ఎనిమిది సెనగగింజలు, కావ లసిన సైజ్‌లో ఓ బటన్, అరస్పూన్ మైదా, ఓ స్పూన్ నెయ్యి, తగినంత బెల్లం తీసుకుని..." అంటూ ఎలా చేయాలో మొత్తం చెప్పింది. అలాగే జీరాకాజా గురించి, ఆవ లడ్డూ గురించి కూడా వివరించింది.

ఆ తరువాత... "ఇలా రండి" అంటూ ఆమెను ఓ పెద్ద హాలులోకి తీసుకెళ్లాడు గంగాళం.

అలంకరించిన గోడలు, మధ్య మధ్య పెయింట్ చేసిన అందమైన చిత్రాలు, పైన షాండ్లియర్స్, కాలికింద మెత్తటి ఆకట్టుకనే తివాచీ అబ్బ ఎంత బాగుందో అనుకుంది మనసులో డెగిసా.

హాలు మధ్యలో విశాలమైన రొటేటింగ్ టేబుల్ ఉంది.

గంగాళం ఆ టేబుల్ పక్కనే నవ్వుతూ చేతులు అటువైపు చూపిస్తున్న

సీరియల్స్ మిస్ అయితే ఎవరూ చెప్పేవారు అందుబాటులో లేరు. అపుడపుడూ తప్పకపోతే మిస్ అయిన ఎపిసోడ్ పొరుగూర్లో ఉన్న మేనత్తని అడిగి తెలుసుకోవలసొస్తోంది.

ఆ టీవీ చూసే అలవాటు వల్లనే కదా ఈ వంటలక్క టైటిల్! తను కూడా టీవీలో కనబడే సెలెబ్రిటీ అయింది. ఎంత కష్టపడింది కొత్త రకంగా వెరైటీగా చేయాలని ఎన్ని ఎపిసోడ్లు వంటల ప్రోగ్రాంలు చూసింది.

అదృష్టం కొద్దీ 'నీకేం తెలిసిచచ్చు– నీ తెలివి పుచ్చు' అనే సినిమాకి వెళ్లేటపుడు పుస్తకాల షాపులో పిల్లలకి అవసరమైనవి ఏవో కొనడానికి వెళ్లిడం, కార్లో కూచోడమెందుకు అందరం వెళదాం అని భర్త గట్టిగా

చెప్పడంతో అనుసరించింది.

లక్కీగా తన దృష్టి అక్కడున్న కొత్త రచనల రాక్‌లో ఉన్న 'వేవెవ' అనే శీర్షిక ఆకర్షించడం, తను ఆ పుస్తకం చేతిలోకి తీసుకుని పేజీలు తిరగేయడం డాక్టర్ కారాబు గారి రచనలు గబగబా చదివేయడం పూర్తికాక పుస్తకం కొనుక్కోవడం జరిగింది. అదే నన్ను ఇక్కడికి తీసుకొచ్చింది.

వాస్తవానికి టీవీకి అంకితమైన తన దినచర్యలో పఠనమనే కార్యక్రమానికి అవకాశమే లేదు. ఏదో అలా జరిగిపోయింది... ఆ వంటలు చదివి చదివి నేర్చుకుని అది విజయవంతంగా ఆకారం దాల్చి పోటీలో నిలదొక్కుకోవడం, ఈ సంవత్సర రాశిఫలాలు తనకి చాలా బాగున్నాయని భవిష్యశాస్త్రిగారు చెప్పిన మాట నిజమైంది... ఇవన్నీ గబగబా మదిలో మెదులుతున్నాయి డెగిసాకి.

"మేడమ్ ఈ వంటలు మీ స్వంత సృజన అని చెప్పగలరా?" అడిగాడు గంగాళం.

"ఆ! చెప్పగలను. కారాబు గారు 'బొత్తం బొబ్బట్లు' అంటారు... నేను 'బటన్ బొబ్బట్లు' అంటాను. బటన్ అనేది నా స్వీయరచన!" ఎక్కడా తడుముకోకుండా చెప్పింది.


"మరో ప్రశ్న... రోజులో కాలాన్ని ఎలా వాడుకుంటారు?"

"ఎక్కువభాగం టీవీ. తప్పదు కాబట్టి వంట. కరెంట్ లేనపుడు స్నేహితులతో ఛాటింగ్! ఒక శాతం మా కుటుంబంతో కాలక్షేపం!"

## ఈ నెల 'దినం'

**అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం -డిశంబర్,18**






"మీకు సంతానం ఎంతమంది?"

"ఇద్దరూ, స్కూల్ కెళుతున్నారు. వాళ్లు, వాళ్ళనాన్నగారూ బయటికి వెళ్ళేదాక సీరియల్ చూడటం కుదరదు. మా వారిది షిఫ్ట్ డ్యూటీ కాదు. జనరల్! " అడగకపోయినా అన్నిటికీ వ్యాసరూప సమాధానాలిచ్చింది డెగిసా.

"మీ పరోక్ష గురువులు డా. కారాబు గారు కేవలం రచయిత లేక మరే ఇతర వ్యాపకమైనా ఉందా?"

"వారు రచించిన పుస్తకం వెనుక భాగంలో వారి సంక్షిప్త పరిచయము ఉంది... వారు అకౌంటెంట్‌గా పనిచేసారు. ఈ మధ్యే విరమణ చేసారు." చెప్పింది.

"అలాగా! సరే మరింత సమాచారం ఏదైనా వారి గురించి నాలుగు మాటల్లో చెప్పగలరా?" అడిగాడు గంగాళం.

"మంచి హాస్య రచనలు చేస్తారట. అందరినీ ఆహ్లాదకరమైన హాస్యంలో ముంచేసి మన సంతా తేలిక పరిచేస్తారని వారి సమీప బంధువులు అంటుంటారట..."

"ఏ విధమైన రచనలు చేస్తుంటారు వారు?"

"ఐడియా లేదు సార్!"


"సార్ కాదు!.. గంగాళం అనండి చాలు. మీకు ఈ టైటిల్ గెలుచుకున్న విషయం కారాబు గారికి తెలిసిందంటారా? వారికి మేము తెలియచేస్తూ వారిని ఆహ్వానిస్తాం. మీరు సరేనంటారా?"

కాసేపు మౌనం వహించి, లోపల అనేక ఆలోచనలతో ఇంక ఏమనాలో తెలీక...'హీ' అని వెర్రినవ్వు విసిరింది.

ఆ నవ్వును పరిశోధనకి తీసుకుంటే... డాక్టరేట్ పట్టాకి ఎక్కువైపోయే అంత విషయం ఉంటుంది.

"మేడమ్! ఇంకా ఏమేమి వెరైటీ వంటకాలు బాగా చేయగలరు?" అడిగాడు గంగాళం.

"అన్ని రకాలు చేసేస్తాను... ఈస్ట్, నార్త్,



సౌత్, వెస్ట్ వంటకాలన్నీ!" చెప్పింది డెగిసా, వీడు చూసొచ్చాడా ఏమిటి అని మనసులో అనుకుంటూ.

"సరే! ఇంకా రెండు ఆవృతాలున్నాయి. అవి కూడా పూర్తికావాలి" చెప్పాడు గంగాళం.

"ఇంకా ఏమి చేయాలి? పురస్కార సభ ఎపుడు ఉంటుంది?" మనసాగక అడిగేసింది.

"ఒక ఆవృతం మీ శ్రీవారితో... మరొకటి డాక్టర్‌కారాబుగారితో మాట్లాడాక ఈ డిసెంబర్ లోపే నిర్ణయిస్తాం!" చెప్పాడు గంగాళం.

"కారాబుగారూ విదేశాలలో ఉన్నారు, మా వారికి ఆఫీసులో సెలవు దొరకదు... అంత అవసరమా మావారితో మాట్లాడటం?..." లోపల గాబరా ఆపుకోలేక అడిగింది డేగిసా.


"అదంతా ఫార్మాలిటీ! ఎన్ని సంవత్సరాల నుంచి మీ వంటకాలు ఆస్వాదిస్తున్నారో... ఎంత ఆరోగ్యంగా ఉన్నారో అలాగే ఈ శుభ వార్తను ఎలా సెలెబ్రేట్ చేసుకున్నారో ఇవన్నీ తెలుసుకోవాలి కదా!" అన్నాడు.

"చిన్న సందేహం అడగవచ్చా?..." అడుక్కుంది శ్రీమతి డెగిసా.

"అడుక్కోండి పర్లేదు" చెప్పాడు గంగాళం.

"కారాబు గారితో ఏ విధంగా ఉంటుందో మీ సంభాషణ కొంచెం చెబుతారా?"

"ది గ్రేట్ రైటర్ డాక్టర్ కారాబుగారికి సత్తు గిన్నె అనే సంస్థ వారు ఓ పురస్కారం మా తప్పేలా స్టూడియో ద్వారా ప్రకటించమన్నారు" చెప్పాడు గంగాళం.




"ఔనా? ఇంతకీ ప్రైజ్ మనీ ఎంత?"

"నథింగ్! కుదరదు. ప్రకటించకుండా, అవార్డీకే తెలియకుండా చెప్పటం!... ఔను, ఇంతకీ మీరు ఏం చదువుకున్నారు? కాలేజ్ ఫ్రెండ్స్ ఎవరైనా ఫోన్ చేస్తూ ఉంటారా? కలుస్తూ ఉంటారా?" ఇంకో ప్రశ్న అడిగాడు గంగాళం.

"తరచుగా మాట్లాడుకుంటూ ఉంటాం!"

"మరి చదువు విషయం చెప్పలేదు?"

ఇంటర్ వరకే చదివానంటే ఇంతేనా అనుకుంటాడేమో అని "యం.ఏ." అని చెప్పింది.

"వెరీగుడ్! ఆఖరుగా ఒక విషయం చెప్పండి మీరు ప్రైజ్ మనీతో ఏంచేస్తారు?"

"ఎప్పటి నుంచో తీసుకోవాలనుకుంటున్న లక్నో చికెన్ వర్క్ శారీ కొనేసుకుంటాను"


ఎంత ఆదర్శవంతురాలో అనుకుంటూ పైకి మాత్రం "ఓహ్!" అని...


"మా వీక్షకులు, అభిమాన పాఠకులు మీ 'డెగిసా' పేరు వెనుక విశేషం తెలుసుకోవాలనుకుంటున్నారు. వివరిస్తారా?" అడిగాడు గంగాళం.

"డెగిసా అంటే డెక్కల గిరిజ నా పేరు, మా వారు సారథి. మూడక్షరాలలో డెగిసా!" చెప్పింది డెగిసా. (ఇలా పొట్టి పేరుతో పిలిపించుకునే వారు సాధించిన ఘనత రోజూ పత్రికలలో చేస్తున్నాం కదా! అలా) ఇది స్వగతం.

"మనం ఇప్పటివరకూ శ్రీమతి డెగిసా గారితో ముఖాముఖిలో ఆమె వ్యక్తిత్వాన్ని 'తప్పేలా' ద్వారా తెలుసుకున్నాం. ఇప్పుడు ఓ ప్రకటన. మా స్టూడియో ద్వారా సత్తు గిన్నె అనే సంస్థ వారు... ఆకాశాన్నంటున్న ధరల తాకిడికి తట్టుకుని, సంప్రదాయ వంటకాల పరంపరను భావితరాలకి అందించాలనే ఆశయంతో, డాక్టర్ కారాబు గారు రచించిన సృజనాత్మక రచనలని ప్రపంచానికి పరిచయం చేస్తూ, వారికి ఆరు అంకెల నగదు పురస్కారం, గౌరవ సన్మాన సభాకార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతోంది... తేదీ వివరాలు త్వరలో తెలియజేస్తాం!" అంటూ కార్యక్రమం ముగించాడు గంగాళం.

డెగిసా కూడా నవ్వుతూ నమస్కారం చేసి లోపల ఏడుస్తూ నిష్క్రమించింది.






ఆ థియేటర్‌లో షూటింగ్ అయ్యేంతవరకూ 'ఇందులో నేను కష్టపడి బహుమతి సంపాదించుకుంటే మధ్యలో మా ఆయన, ఆ రచయితలతో పనేమిటి?.. పైగా ఏదో ఆరంకెల పురస్కారం అంటాడు. ముందు అదేమిటో మా ఆయన్ని అడిగి తెలుసుకొనే వరకూ టెన్షనే!" అన్న ఆలోచనలో ఉండిపోయింది డెగిసా.

బయటికి వచ్చేటప్పుడు గంగాళం–

"జీ యఫ్ సీ వారు ఫైనల్ చేసాక... మీకు ఫోన్ వస్తుంది. ధన్యవాదాలు ఇక మీరు వెళ్ళ వచ్చు!" అంటూ డెగిసాని సాగనంపాడు.

డెగిసా ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిది అయింది. భర్త, పిల్లలు ఆమె కోసం ఎదురు చూస్తున్నారు. హేపీగా బయట భోజనం చేసి, డెగిసా కోసం పార్సిల్ తెచ్చేసి టేబుల్ కేసి చూపిస్తూ భోజనం చేయమని చెప్పాడు భర్త.

ఆ తరువాత పేపర్ చదువుకుంటున్న భర్త సారథి దగ్గరకి వచ్చి– "ఏవండీ! ఆరంకెల పురస్కారం అంటే ఏమిటి?" అడిగింది.


"లక్షకంటే ఎక్కువ...పదిలక్షలకి రూపాయి తక్కువ వరకూ ఆరంకెలే. ఔనూ, ఎవరికేమిటి పురస్కారం? నీకే?" ప్రశ్నించాడు ఆశ్చర్యంగా.

"నాకు కాదులెండి. అది నేను చేసిన పిండి వంటల తాలూకు పుస్తక రచయితకి ప్రకటించారు... చూసారా!... రాయడం కష్టమా?... చేయడం కష్టమా?...చెప్పండి?" అంది.

"సృజనాత్మక రచన చేయడమే కష్టం. రచయితకి తగిన గుర్తింపు. చూసి చేయడంలో విశేషం ఏముంది. నేనూ, నువ్వూ... ఎవరైనా ఇట్టే చేసేస్తారు!"

"నాకు టైటిల్ రావడం మీకు సంతోషం, నమ్మకం రెండూ కలిగించలేదు కదా! ఎవరో తెలీని వారిని మెచ్చుకుంటారు కానీ... నా ప్రతిభను ఒప్పుకోరు. అంతేనా?..." అంది ఉక్రోషంగా.

"అహ అలా కాదు! ఎన్నేళ్ళ నుంచి చూస్తున్నాను చెప్పు! నీ గురించి తెలుసు కాబట్టి చెప్పాను... సరే కానీ నువ్వు చేసినవి వారు రుచి చూసాకే నీకు టైటిల్ ప్రకటించారా అని ఒకసారి అడిగి తెలుసుకోవడం మంచిది... రూపకల్పన అద్భుతమైన ఆకర్షణ కలిగించి టేస్ట్ చేయలేదేమో... నీ పనితనం తెలుసుకున్నారో లేదో మరి?"




"అదేమిటీ అలా అంటారు, నా పేరు ప్రకటించాక కూడా మీకు ఇన్ని సందేహాలు?" అంది భర్తతో... లోపల రగిలిపోతూ!

"అపాత్ర నామ ప్రకటన చేసేరేమో? రేపెపుడో సవరణ వస్తే మళ్ళీ మీ చెలికత్తెల దగ్గర నుంచి ఫోన్లు, ఓదార్పు యాత్రలూ అవసరమా అని?"

అదేదో ప్రశంస అనుకుందేమో–

"సంతోషమే కదండీ అలా ఫోన్లు రిసీవ్ చేసుకోవడం?" అంది.

"హతవిధీ!"అనుకుంటూ... "సరేలే... ఉదయం ఆఫీస్‌కి త్వరగా వెళ్లాలి..." అంటూ నిద్రకు ఉపక్రమించాడు సారథి.

ఆరోజు జరిగినవన్నీ గుర్తుచేసుకుంటూ... మెమెంటో, చెక్కుతో కవర్, ఓ బొకే, అందమైన కాశ్మీర్‌షాల్ వేసుకుని నడిచొస్తున్న తన రూపం తలుచుకుంటూ ఆనందంగా ఎదురుచూపులు ఒకవైపు...ఒకవేళ కారాబుగారికి ఆరు అంకెల పురస్కారం ఇస్తే మటుకు, ఆ అంకెలు రూపాయలు కాకుండా పైసలు అయితే బాగుండును అనే ఆలోచన మరోవైపు...

ఇలా ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రలోకి జారుకుంది, వేవెవ అంటే, వేయి వెరయిటీ వంటకాలు చదివిన వంటలక్క.

చివరికి ఏం జరుగుతుందో... కాలచక్రంలో ఎన్ని మలుపులు తిరుగుతాయో... ఎవరికి తెలుసు చెప్పండి!

# కొత్త పుస్తకాలు

## బ్నిం గారి- బాపు గారి తో నేను

'చైల్డ్ ప్రాడిజీ' బ్నిం గారు, ఏ బడిలో చేరితే తనకి కావలసిన విద్య అబ్బుతుందో బాగా ఆలోచించి ముందస్తుగానే ప్రిపేర్ అయ్యారు. ఆపాటికే వాళ్ళ అమ్మగారు విద్యా సరస్వతి విజయలక్ష్మి, బ్నింగారికి సాహిత్యానికి సంబంధించిన వ్యాకరణ సుత్రాలు చక్కగా నేర్పించి వున్నారు. తుమ్మలపల్లి వారు, బ్నిం ను, 'బాపూ బడి (వొడి)' లో చేర్పించారు. అది మామూలు బడి కాదండి. అక్కడి చదువూ, సిలబసూ ప్రత్యేకించి నలభైఅయిదేళ్ళ పాటు 'ఇంటర్న్ షిప్' తో సహా కోర్సు కొనసాగింది.




ఆ బళ్ళో, బ్నింగారికి క్లాస్ మేట్లు చాలా మంది. రమణ, శ్రీరమణ, నవోదయ రామ్మోహన్‌రావు, తనికెళ్ళ భరణి, బీవీయెస్ రామారావు, ఎంవీయెల్ గార్లు... ఇలా చాలా మంది. అందరూ ఉద్దండులు. ఇంతటి అదృష్టవంతులైన బ్నింగారు ఎప్పుడూ క్లాస్ ఫస్టే! అందుకే బడి ప్రొప్రైటర్, బాపూగారే మెచ్చి బ్నింగారికి ఒక ప్రత్యేక స్థానం కల్పించారు. తమ పక్కన కూర్చోపెట్టుకుని ఫిల్మ్ స్క్రిప్టింగ్, షూటింగ్, ఎడిటింగ్ పనులు చేశారు. అంటే, ఇంగ్లీషులో ఇలా చెప్పొచ్చు-'Bnim became an extraordinary student of Bapu School of thought.' అని.

మనకు తెలిసిన బ్నిం 'కళారత్న' బిరుదాంకితుడు. చదువరి... పండితుడు. కవి. రచయిత. విమర్శకుడు. అనేకానేక నృత్య రూపకాల సృష్టికర్త. వర్ణ చిత్రకారుడు, అన్నిటికీ మించి మన తోడి కార్టూనిస్టు. అరవైయేళ్ళ వసంతాల పరిమళాలు అనుభవించిన చిరంజీవి బ్నిం, తాను చవి చూసిన జీవిత వాస్తవాలను, మనందరికీ గీతల పరమగురువు ఆరాధ్య దేవుడు, బాపూగారితో సాగించిన పయనాన్ని, ఈ అద్భుత పుస్తకంలో పూస గుచ్చి రంగురంగుల ఫోటోలతో, బొమ్మలతో, జోకులతో, అక్షింతల పులకింతలతో, తన టేబుల్ సొరుగులోని ఉత్తరాల సాక్షిగా, చివరి పేజీలోని 'అమ్మ' సాక్షిగా తనకే సాధ్యమనిపించే సుందర తెలుగులో వివరించి చెప్పారు.

ఈ పుస్తకం 'ఫస్ట్ టు లాస్ట్ పేజ్' రంగుల నూట ఇరవై ఆర్ట్ పేపర్లో ప్రింట్ అయిన ఫోటో ఆల్బం అనే చెప్పాలి. బాపూగారి అద్భుతమైన అందమైన బొమ్మలు కన్నులవిందు చేస్తాయి. వాటిల్లో కొన్ని బొమ్మలు ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం కానివి వున్నాయి. ఈ పుస్తకం చూసాక చిరంజీవి బ్నింగారి చేతిని ముద్దుపెట్టుకోవాలనిపించేస్తుంది.


ఈ పుస్తకాన్ని ప్రచురించించిన **అక్షజ్ఞ పబ్లికేషన్స్** వారు అభినంద నీయులు. **ఈ పుస్తకం కావాలంటే 8341450673 కి ఫోన్ చేయండి.**

**-జయదేవ్**

## మావగారు-మాగాయ హాస్య కథలు

ప్రముఖ కథా రచయిత **కోనే నాగ వెంకట ఆంజనేయులు** గారి ప్రథమ హాస్య కథల సంపుటి విడుదలయింది.

కోనే గారు అటు సామాజిక కథలు, యిటు హాస్య కథలు, మరో వైపు పిల్లల కథలు పుంఖాను, పుంఖాలుగా రాసి పేరు గడించారు. ఆయన రాసిన హాస్య కథలలో కొన్ని కథలతో- **'మావగారు-మాగాయ'** పేరుతో హాస్య కథల సంపుటి 'సాహితీ ప్రచురణలు' సంస్థ నుండి విడుదలయింది.




ఇందులో 38 చమక్కుమనిపించే మినీ, మాక్సీ, పెద్ద హాస్య కథలు మిమ్మల్ని ఆపకుండా చదివిస్తాయి. చదివించడమే కాకుండా నవ్విస్తాయి కూడా! వీరి కథల్లో కనిపించే కొన మెరుపు మమ్మల్ని హాస్యాంబుదిలో దింపి నవ్వుల్లో ముంచెత్తుతాయి.

ఈ సంపుటిలో సగం పైగా కథలు వివిధ పోటీల్లో బహుమతులు పొందినవే. ఒకదానికొకటి సంబంధం లేని వేరు వేరు ఇతివృత్తాలు తీసుకుని రచయిత హాస్య కథలుగా మలిచిన విధానం ఆసక్తికరం, వినోద భరితం.

పుస్తకం మొదలు పెడితే పూర్తి అయ్యేవరకూ ఆపకుండా చదివించకపోతే మీరు నవ్వుల ఊబిలో కూరుకుపోయింత ఒట్టు.

మిమ్మల్ని నవ్వుల నదిలో విహరింప జేసే ఈ హాస్య కథల సంపుటి విలువ అపారం అయినా వెల మాత్రం నూట యిరవై అయిదు రూపాయలు మాత్రమే. **ఏమండోయ్! మీరు ఈ నూట యిరవై అయిదు రూపాయలు చెల్లిస్తే చాలూ... పోస్టల్ చార్జీలు మన హాస్యానందం పాఠకులకు ఉచితం!**

**ప్రచురణ, ప్రతులకు:**

**సాహితీ ప్రచురణలు, 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002**

**వివరాలకు ఫోన్:0866-2436642/43. సెల్ : 8121098500**




మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక! 12

## పద్మ

పద్మ... పేరుతో 1985 సంవత్సరాల నుండి కార్టూన్లు గీస్తున్నా నేను పుట్టింది మచిలీపట్నంలో, ప్రస్తుతం ఉంటున్నది విజయవాడలో. వృత్తి ఉపాధ్యాయిని, ప్రవృత్తి కార్టూనిస్టు. చిన్నప్పటినుండి హాస్యం పట్ల మక్కువ ఎక్కువ. చిన్నప్పుడు నాన్నగారు పత్రికలు తెస్తుండేవారు. అందులో కార్టూన్లు నన్ను ఆకర్షించేవి. కొన్ని కార్టూన్లు చదువుతుంటే ఈ కార్టూన్ ఇలా కాకుండా మరోలా ఉంటే బాగుంటుందని... అనిపించి, నాకు వచ్చిన ఐడియాని ఒక పేపర్‌పై రాసి ఆ కార్టూన్‌పై అతికించి, ఒక కార్టూన్ నుండి మరో కార్టూను సృష్టించి నవ్వుతుం టుండేదాన్ని. తరువాత... బొమ్మలు నేర్చుకుని, మనమెందుకు కార్టూన్లు వెయ్యకూడదూ అనిపించింది. దాంతో జయదేవ్, రాగతి పండరి గార్ల కార్టూన్ బొమ్మలను ప్రాక్టీస్ చేసాను. అదే సమయంలో కొంతమంది కారూనిస్టు మిత్రుల పరిచయం ఏర్పడి, వారివద్ద కార్టూన్లో ప్రాథమిక సూత్రాలు... బొమ్మలు గీసే విధానం నేర్చుకుని, కార్టూన్లు వేయడం మొదలు పెట్టి, స్థానికంగా ఉన్న పత్రిక ఆఫీసు కెళ్ళి ఇస్తుండేదాన్ని. ఈ సందర్భంగా నన్ను ప్రోత్సహించిన ఆ పత్రికా సంపాదకులకూ, కార్టూన్ గురువులకు ధన్యవాదాలు.


ఇప్పటిదాక సుమారు ఐదువేల కార్టూన్లు వివిధ పత్రికలలో ప్రచు రించబడినాయి. పలు పత్రికలు, సంస్థలు నిర్వహించిన పోటీలలో రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలలో బహుమతులు లభించాయి.


పలు ప్రాంతాల్లో నా కార్టూన్ల ప్రదర్శనలు ఏర్పాటు జరిగింది.


2011 సంవత్సరంలో నా కార్టూన్ల సంకలనం విడుదలైంది. ఒక ఉపాధ్యాయిని అని చెప్పుకోవడంకన్నా... కార్టూనిస్టు అని చెప్పు కోవడం నాకెంతో గర్వంగా ఉంటుంది.


అరుదైన కళలలో అపురూపమైనది కార్టూన్ కళ.


ఈ కళలో నేనుండటం భగవంతుడు నాకు ప్రసాదించిన వరంగా నేను భావిస్తాను.


















బడికివెళ్ళి చదువుకుంటే నీస్థితి మారుతుంది...రా!
వద్దు...వద్దు... అంతకష్టం...!!
ఇందా...ధర్మం తీసుకో...!!
ఆరోజు మీతో బడికి వస్తే ఈరోజు ఈపరిస్థితి వచ్చేదికాదు...బాబు!!



బాషమీద పట్టుండాలి... అన్నావుగా... పక్కింటి ఆంటి నేను వెళ్ళగానే "ప్లీజ్ టేక్ యువర్ సీట్" అన్నారు... అందుకే పట్టుకొచ్చేసాను !!



సంసారం....ఫేస్‌బుక్ లో లా రచ్చకాకుండా వాట్సప్ లా గుట్టుగా జీవించండి...!!


ఏ కంపార్ట్‌మెంట్ లో ఎక్కువ నగలు పెట్టుకున్న వాళ్ళున్నారో కాస్త చెప్తారా?
ప్రత్యేక ఎంక్వయిరీ.


జీవితాంతం నా సెల్ రీఛార్జ్ లేకుండా పనిచేసే 'వరం' ఇవ్వండి...స్వామీ....!!


బిడ్డకు పాలు ఇచ్చివస్తావా...సరే...నాఫోన్‌తో జి.పి.యస్. ట్రాకర్ పెట్టుకుంటూ..పోయిరా!!


నాతప్పేంలేదుసార్... ఆర్నెలులో గొలుసులాగుము...అని రాసుంది!!



# ఆనందోత్సాహాలతో కార్టూనిస్టుల కార్తిక సమ్మేళనం 2024

**ప్రతియేట కార్తిక మాసంలో కార్టూనిస్టు శ్రీమతి పద్మగారు కార్టూనిస్టుల కార్తిక సమేళనం నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కార్టూనిస్టులు ఆట పాటలతో ఉత్సాహంగా ఈ పాల్గొంటారు.**

ఈ సంవత్సరం నవంబరు,10, ఆదివారంనాడు విజయవాడ సర్ ఆర్థర్ కాటన్ హైస్కూలు ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసారు. సుమారు 35మంది కార్టూనిస్టులు, కొంతమంది కార్టూన్ ఇష్టులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముందుగా ఈ కార్యక్రమాన్ని ప్రతియేటా ఎంతో వ్యయప్రయాసలతో కార్టూనిస్టుల మీద అభిమానంతో ఏర్పాటుచేస్తున్న శ్రీమతిపద్మగారిని హాస్యానందం రాముగారు చక్కని మెమెంటోతో, శాలువతో కరతాళ ధ్వనుల మధ్య సత్కరించారు.

తదుపరి పద్మగారు హాజరయిన కార్టూనిస్టులందరికి ఫ్రెండ్ షిప్ బ్యాండులు అందజేయగా అందరూ ఒకరికొకరు కట్టుకుని ముంజేతికి ధరించారు.

తరవాత వివిధ పోటీలు నిర్వహించారు. ఒకోదానికి మూడు బహుమతులు చొప్పున అందించారు.

ప్రముఖ కార్టూనిస్టు శ్రీ ఏవీఎమ్‌గారు, హాస్యానందం రాముగారు ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

ఈ సభలో కోనేగారి హాస్యకథల పుస్తకం ఆవిష్కరణ జరిగింది.

ఇది సాహితీ ప్రచురణ, విజయవాడ వారు వెలువరించారు

ఈ కార్యక్రమంలో చివరిగా 'చెట్టు వలన ఇబ్బందులు' అనే అంశంతో గీసిన కార్టూన్లలోంచి మూడింటికి బహుమతులు ఇవ్వటం జరిగింది. (ప్రక్క పేజీలో కారూన్లు)




నిర్వహకులు శ్రీమతి పద్మగారిని సన్మనిస్తున్న హాస్యానందం





శ్రీ కోనే నాగవెంకట ఆంజనేయులు హాస్య కథల పుస్తకం ఆవిష్కరణ.




**నిలుచున్న వారు–** శ్రీయుతులు లాల్, మైనేపల్లి, పద్మదాస్, సుభాని, అంతోటి ప్రభాకర్, మురళి, జమదగ్ని, బాలకృష్ణ, కృష్ణశ్రీ, రావెళ్ళ, మురళీధర్, సుజయ్‌కృష్ణ, జెన్నా, ప్రసిద్ధ, మణి, ఎ.ఆర్.సుధాకర్, నాగిశెట్టి, ఆదినారాయణ, జయదాస్. **కుర్చున్నవారు–** శ్రీమతి పద్మ, శ్రీయుతులు అరుణ్, కోనే, కె.వి.వి.సత్యనారాయణ, హాస్యానందం రాము, ఏవీఎమ్, ప్రసాద్ కాజ, జకీర్, బాచి.





# చెట్ల వలన ఇబ్బందులు













# అవతారం పెళ్ళికి అందరూ రండి!

బెల్లంకొండ నాగేశ్వరరావు
9884429899

**"అయ్యా! రమణయ్య గారు... మీరు కోరిన విధంగా మీ అబ్బాయికి తగిన సంబంధం తీసుకువచ్చాను... అమ్మాయి పేరు వయ్యారి!" అని తన చేతి సంచిలోనుండి అమ్మాయి ఫోటో తీసి రమణయ్యకు అందించాడు పెళ్ళిళ్ళ పేరయ్య.**

**"ఇదేమిటయ్య గడకర్రకు చీర చుట్టినట్లు ఉంది?!" అన్నాడు రమణయ్య.**

**"మరేనండయ్య! అమ్మాయి కాస్త సన్నాగా ఉంటుంది. ఒక్కర్తే సంతతి కనుక మీకు కావలసినంత సొమ్ముతో మీ యింటికి వస్తుంది అసలు ఆస్తంతా ఆమెకేగా వచ్చేది!..." అన్నాడు పేరయ్య.**

"సరే మంచిరోజు చూసుకుని వస్తామని అమ్మాయి వాళ్ళకు తెలియ జేయండి!" అన్నాడు రమణయ్య.

"రేపు ఉదయం తొమ్మిది గంటల అనంతరం దివ్యంగా ఉంది!" అన్నాడు పేరయ్య.

"సరే అలాగే వెళదాం రేపు ఉదయం మమ్మల్ని వాళ్ళింటికి తీసుకు వెళ్ళు!" అన్నాడు రమణయ్య.

"మరి నాసంగతి..." నసిగాడు పేరయ్య.

"సంబంధం కుదరనియ్యవయ్య అప్పుడు ఆలోచిద్దాంలే!" అన్నాడు రమణయ్య.

తరువాతి రోజు మగపెళ్ళి వారైన రమణయ్య ఆయన భార్యా, కుమారుడుతో ఆడపెళ్ళి వారింటికి చేరిన పేరయ్య, కూర్చోవడానికి కుర్చీ వెదుకుతూ ఫేన్ స్విచ్ వేయబోయాడు.

"ఆగండి పేరయ్య గారు!... ఫేన్ ఎందుకు కరెంటు ఖర్చు!... పైగా వాడితే అరిగిపోతుంది. ఇలా వచ్చి ఈ కిటికి దగ్గరగా దీనిపై కూర్చోండి!" అని గ్యాస్ సిలెండర్ చూపించాడు సోమయ్య.

రమణయ్య, అతనిభార్య, పెళ్ళికుమారుడు అంతా... ఎప్పుడైనా విరగడానికి సిద్ధంగా ఉన్న చెక్కబల్లపై కుర్చున్నారు.

ఆ బల్ల కొబ్బరి తాళ్ళతో పలుచోట్ల బిగించి కట్టబడి ఉంది.

ఏదైనా ప్రమాదం జరిగి గ్యాస్ లీకైతే తన నోట్లో నుండి ఆ గ్యాసు వెలుపలకు వస్తుందేమోనని భయపడుతూనే, గ్యాస్ సిలండర్ పైనే సర్దుకు కూర్చున్న పేరయ్య ... "మహూర్త సమయంలోనే అమ్మయిని చూపించాలి!" అన్నాడు.

కూర్చోవడానికి మరో గ్యాస్ బండో, ఇరిగిన కుర్చీనో లేకపోవడంతో గుమ్మంపైనే కూర్చున్న సోమయ్య– "అలాగే... అమ్మా! వయ్యారి, రమణయ్య బావగారికి మంచినీళ్ళు, విసినకర్రా తీసుకురా!" అన్నాడు.

ఒంటినిండా నగలు ధరించి యాభై ఏళ్ళనాటి పట్టుచీరతో ఒక చేతిలో అంచులులేని మట్టిముంతలో మంచి నీళ్ళు... రెండవ చేతిలో శిధిలావస్తలో ఉన్న విసినకర్ర తీసుకు వచ్చి... అక్కడ ఒక కాలు విరిగి ఒంపుగా ఉన్న వందేళ్ళనాటి చెక్క బల్లపై పెట్టి... చిరుగుల ఈత చాపపై కూర్చుంది పెళ్ళి కుమార్తె.


ముట్టుకుంటే విసినకర్ర విరిగిపోతుందని అవతారం దాన్ని తాకలేదు. రమణయ్య దాహంతో అంచులేని ముంతలోని మంచినీళ్ళు ఎత్తి పోసు కోవడం వలన సగం నోట్లోకి సగం చొక్కాపైన పడ్డాయి.

"రమణయ్య బావగారు! మమ్మల్ని పిసినారి వారు అనుకోకండి. మాకు కొన్ని సెంటిమెంట్లు ఉన్నాయి. ఈచాప మా అమ్మమ్మగారు కాపురానికి వస్తూ తెచ్చింది. ఈ విసినకర్ర మాతాతాగారి చేతిలోనే రేయింబ వళ్ళు ఉండేది... ఈ నీళ్ళ ముంత నా భార్య అమ్మమ్మ తన గుర్తుగా ఇచ్చింది, ఏవైనా శుభ కార్యాలయితే తప్ప అమూల్యమైన సంపద అయిన వీటిని బైటకు తీయము..." అన్నాడు సోమయ్య.

అదివిన్న పేరయ్యకు ఒళ్ళుమండి...

"మరి మీ అయ్య అదేనండి తమరి తండ్రి గారి గుర్తుగా ఏమిలేవా?" అన్నాడు.

"భలే వారే పేరయ్యగారు!... సమయానికి గుర్తు చేసారు. మా నాన్నగారు భోజనం చేసే మూకుడు నాకే ఇచ్చారు!" అన్నాడు సోమయ్య.



తిక్కరేగిన పేరయ్య– "ఏమిటీ!... నీళ్ళబానపై మూతగా వాడే మూకుడా?" 'అన్నాడు.

"ఔనండి... నేటికి నేను దాంట్లోనే భోజనం చేస్తా!"

తాతలకాలం నాటి వస్తువులనే భద్రంగా వాడుతున్న వారిని చూసి మురిసిపోయిన రమణయ్య– "శుభం!... మీతో వియ్యం అందడం మా అదృష్టం బావగారు. రేపు ఒకసారి మా ఇంటికి భోజనానంతరం రండి మా ఇల్లు వాకిలి చూసినట్లు ఉంటుంది... మిగతా విషయాలు మాట్లాడుకుందాం!" అన్నాడు. తలఊపాడు సోమయ్య.

మరుసటి రోజు పేరయ్యతో కలసి... సోమయ్య కుటుంబ సభ్యులు రమణయ్య ఇంటికి వెళ్ళారు. సాదరంగా ఆహ్వానించిన రమణయ్య...

"కొద్దిగా మంచినీళ్ళు తాగి నాలుగు వక్క పలుకులు నోట్లో వేసుకుని చప్పరిస్తూ పెళ్ళి విషయాలు మాట్లాడుకుందాం!" అన్నాడు రమణయ్య.

అందరూ నీళ్ళుతాగిన అనంతరం అవతారం ఒక మట్టి ముంతలో నీళ్ళు, ఒక గుడ్డముక్కలో వక్కపలుకులు తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళాడు.

వీళ్ళ సంగతి తెలిసే ఇంటి వద్దభోజనం చేసి వచ్చిన పేరయ్య... బోడ్లో ఉన్న నాలుగు తమలపాకులు తీసి సున్నంరాసి, అక్కడ గుడ్డ మూటలో ఉన్న కొన్ని వక్క పలుకులు నోట్లో వేసుకుని తాంబూలం నములుతూ నోరు పండిందో లేదోనని తన నాలుక వెలుపలకు తీసి చూసుకోసాగాడు.

అది చూసిన సోమయ్య– "బావగారు! ఇప్పుడు ఈ మర్యాదలు ఎందుకు?... వక్కపొడి ధర మన ఆస్థిలో నష్ట పోయాం కదా!... అద్ద మైన వాళ్ళంతా ఎలా తింటున్నారో చూడండి!" అన్నాడు కోపంతో.

ఇవేమి పట్టించుకోని పేరయ్య అప్పటికే తాంబూలం నాలుగు గుటకలు వేసాడు.

"ఆవేశపడకండి సోమయ్య బావగారు! ఈ వక్క పలుకులకు ఎనభై ఏళ్ళ చరిత్ర ఉంది. మనకు స్వరాజ్యం రాకమునుపు మా తాతగారు నైజాం నవాబుగారి వద్ద పని చేసేవాడు అప్పటివి ఈ వక్క పలుకులు."

"డెభై ఆరేళ్ళనాటి వక్కపలుకులా?" ఆశ్చర్య పోయాడు పేరయ్య.

"అప్పుడైనా మీ తాతగారు డబ్బు పెట్టి కొన్నవేగా... మన ఆస్తిలో ఇలా ఇంత డబ్బు ఆడంబరాలకు, విలాసాలకు కర్చుపెడితే ఎలా?" అన్నాడు సోమయ్య.



"బావగారు వినండి! మా తాతగారు... నవాబ్‌గారు నమలకుండా ఉమ్మిన వక్కపలుకులు ఏరుకువచ్చి కడిగి దాచిపెట్టారు... మేము ఏవైనా ఇటువంటి శుభకార్యాలలో మాత్రమే నాలుగు పలుకులు నోట్లో వేసుకుని చప్పరించి తిరిగి ఆవక్క పలుకులు ఆ ముంత నీళ్ళలో కడిగి ఆ గుడ్డతో తడిని అద్ది...ఆరబెట్టి మరో శుభకార్యానికి వాడతాం, ఇప్పుడు కూడా ఈ వక్క పలుకులు నే చెప్పిన విధంగా వాడండి, రేపు పిల్లల పెళ్ళిలో కావాలిగా!" అన్నాడు రమణయ్య.

రమణయ్య చెప్పిన వక్కపలుకుల కథ విన్న పేరయ్య వస్తున్న వాంతిని ఆపుకుంటూ "మీ పెళ్ళివద్దు, మీ సంభావన వద్దు..." అనుకుంటూ బయటికి పరుగు తీసాడు.

ఈ కథ చదిన హాస్యానందం పాఠకులకు విన్నపం ఏమిటంటే...

అవతారం, వయ్యారి పెండ్లి ఫిబ్రవరి 30 న జరగబోతుంది మీరంతా ఆ పెళ్ళికి వచ్చి ఘనంగా కానుకలు ఇచ్చి, వధూవరులను ఆశీర్వదించి వారు ఇచ్చే పసందైన విందు ఆరగించి... అనంతరం తాంబూలంలో ఆ వక్క పలుకులు నాలుగు నమల (చప్పరించ) వలసిందిగా కోరుకుంటున్నాను.

# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## అందుకే వద్దు...

**వెలిగీ ఆరుతున్న టపాకాయ పక్కనుండి నడుస్తున్నట్టు, కాస్త తటపటాయించి నడుస్తూ... మేనేజర్ రూమ్ డోర్ తెరిచి, తలని తలుపు సందులో పెట్టి... "మే..." అంటుండగానే పీక ఆ తలుపు సందులో ఇరుక్కుపోయింది.**

**దాంతో పూడుకుపోతున్న గొంతుతో "మే...మే...మే..." అని బలవంతంగా ఆ తలపు తెరిచి "మే ఐ కమిన్ మేడం?" అన్నాడు మధు... పీక సవరించుకుని, పళ్ళు కనిపించేలా నవ్వుతూ.**



"ఏవిటా మేక గోల? ఎస్ కమ్ ఇన్!" అంది లలిత అతని వంక చూడకుండానే.


అదే నవ్వుతో లోనికి వెళ్ళి, ఆమె ఎదురుగా స్కూల్ పిల్లాడిలా బుద్ధిగా నుంచున్నాడు.

ఆమె, లాప్‌టాప్‌లోనుంచి తల బయటపెట్టి చూస్తూ... "హే మధూ! నేనే పిలిచాను... రా కూర్చో! ఎలా ఉన్నావ్?" క్షణం ఆగి... కాస్త అయోమయంగా చూస్తూ... "అదే! అందరూ తొందరగా ముందరకి వెళ్ళిపోవాలనుకుంటుంటే నువ్వేమిటీ వెనక్కి వెళ్తానంటున్నావ్? డిప్యూటీ మేనేజర్‌గారు... విషయం మొత్తం, సన్నటి ఊసకి సున్నటి పూస గుచ్చినట్టు నాకు మొత్తమంతా వివరంగా వివరించారు. నిన్ను మేనేజర్ పోస్టకి సెలెక్ట్ చేసాం అని ఆయన కంగ్రాట్స్ చెబితే కంగారుపడిపోయావట!... షేక్‌హ్యాండ్ ఇస్తే, ఎట్‌లిస్ట్ క్షణం ఆలోచించకుండా చెయ్యి వెనక్కి లాగేసుకుని... నాట్ ఇంట్రస్టెడ్ అని ఘాటుగా చెప్పేసావట... ఇప్పుడున్న టీం లీడర్ పోస్టే బెస్ట్ అనీ... అందులోనే కొనసాగాలనుకుంటున్నట్టుగా చెప్పి ట్విస్ట్ ఇచ్చావట. ఇలా అయితే అందరూ నీకంటే ముందుకు వెళ్ళిపోతారు... ఇంకా చెప్పాలంటే, నీ వెనక జాయిన్ అయిన జూనియర్స్ కూడా తారాజువ్వల్లా జుయ్‌మంటూ... ముందుకు దూసుకుపోతారు. అప్పుడు నువ్వు వెనకబడిపోయావని వాళ్ళు నిన్ను వెవ్వెవ్వే అని నాలుక బయట పెట్టి వెక్కిరిస్తారు. అప్పుడు నువ్వు వెక్కెక్కి బాధపడినా, ఒక్క శాతం ప్రయోజనం ఉండదు... పైగా ఇంత సీనియర్ అయ్యుండి, టీ కప్పంత కాంపిటేటివ్ స్పిరిట్ లేకుండా... ఈ కార్పొరేట్ సంస్థలో ఓ కార్పెట్‌లా ఉన్నచోటే ఉండిపోతావా!? నీకెలా ఉందో తెలీదు కానీ... నిన్ను రికమండ్ చేసినందుకుగ్గాను నాకైతే అదోలా ఉంది... అందుకే అసలు కారణం ఏమిటో తెలుసుకుందామనే... నిన్ను పిలిపించాను." సూటిగా చూస్తూ అందామె.

"నా ఈ కారణం వెనుక ఒక పెద్ద రణం ఉంది మేడం! ఆ ప్రమోషన్ పేరుతో నేను మరీ రోబోట్ అయిపోలేను. ఇప్పటికే పని మనిషిలా పనిచేస్తున్నాను... ఇక మేనేజర్ అయితే, రోబో అయిపోతాను. అందుకే మన డిప్యూటీ మేనేజర్ గద్దించి అడిగినా... నేను వద్దని చెప్పేసాను. ఆ తొమ్మిది వేల హైక్‌కి కక్కుర్తి పడితే... ఈ ఆఫీస్‌లో నా లైఫ్, పాస్వర్డ్ లేని వైఫై అయిపోతుంది. అందరూ నన్ను వాడేసుకుంటూ ఆడేసుకుంటారు. నేను రోజూ వారిని ఆడిపోసుకుంటూ, చిన్న సైజు మేడ్ ఫెలో అయిపోతాను... అందుకే ఈ టీం లీడరే కొంత పర్వాలేదు. కనీసం ఒక కప్పు టీ తాగడానికో, గుప్పుమని ఓ సిగరెట్ ఊదడానికో, ఒక ఐదు నిమిషాలు ఈ ఖైదు నుండి విడుదలయ్యి ఊపిరి పీల్చుకోవడానికో సమయం చిక్కుతుంది. అదే ఆ మేనేజర్ కుర్చీలో ఉంటే, ఎప్పుడు ఏ క్లయింట్ స్కైప్‌లో ఫోన్ చేస్తాడో, ఎప్పుడు ఏ యు.యస్. మేనేజర్ ఏ జూమ్‌లో ఏది అడుగుతాడో అని క్షణం, క్షణం వణికి, వణికి... బిక్కు బిక్కుమంటూ... బిక్కచచ్చిపోతుండాలి. ఒక్క ముక్కలో చెప్పాలంటే... యు.ఎస్. క్లయింట్ల చేతిలో నేనో రిమోట్‌లా నలిగి పోతాను... పేపర్‌లా చిరిగిపోతాను...

గంధం చెక్కలా అరిగిపోతాను...పుల్లముక్కలా విరిగిపోతాను. ఎందుకంటే ప్రోసెస్‌లో ఏది కావాలంటే అది నా ద్వారానే... చేయిస్తారు కనుక. నేను మరీ అంత మెకానికల్‌గా వర్క్ చేయలేను మేడం! అందుకనే, నిర్మొహమాటంగా డిప్యుటీ మేనేజర్ మొహం మీదే వద్దని చెప్పేసాను...మీరు కూడా ఈ విషయంలో నాకు విషమ పరీక్ష పెట్టరనీ, నన్ను ఫోర్స్ చేయరని... అర్థం చేసుకుంటారని... నా నమ్మకం!" అంటూ బలవంతాన నవ్వాడు.

ఆమె క్షణం ఆలోచించి– "ఇట్స్ ఓకే! మా సిబ్బందిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం మాకూ లేదు!" అంటూ... మధు నవ్వులో నవ్వు కలిపింది.





దాంతో, హమ్మయ్య ఓ పెద్ద భారం దిగిపోయింది అన్నట్టు కాస్త రిలాక్స్ అయిపోయి, తన చొక్కా కాలర్ సరి చేసుకుని... లేచి థాంక్యూ చెప్పి బయటికి వచ్చేసాడు మధు.

తర్వాత కేఫిటేరియాలో మధు ఫ్రెండ్ గిరి కనబడి– "ఏంట్రా సీనియర్ మేనేజర్ పిలిచి ప్రమోషన్ ఇస్తానంటే, వద్దు పో అనేసావట... చాలా మందిని వర్క్ పేరుతో బండకేసి రుద్దినట్టు రుద్దుతున్నా... ఆ ప్రమోషన్ కోసం మొద్దుల్లా కూర్చుని... ఎద్దుల్లా కష్టపడిపోతున్నారు. అలాంటి ప్రమోషన్ని చేజార్చుకుని కాలదన్నుకుంటావా?... అయినా ఆ మాత్రం వర్క్‌ప్రెజర్ లేకపోతే ఇది కార్పోరేట్ ఉద్యోగం ఎందుకవుతుందీ?" అడిగాడు ఆశ్చర్యంగా.

"వర్క్ ప్రెజర్ కొసరు కారణం మాత్రమే! అసలు కారణం వేరే ఉంది... ఆ అసలు కారణం చెప్పలేకే ఈ కొసరు కారణాన్నే అసలు కారణంలా చెప్పాల్సివచ్చింది!" మొహాన్ని మల బద్ధకం మనిషిలా పెడుతూ చెప్పాడు మధు.

"అదేంటీ?... వినడానికి విచిత్రంగానూ, నమ్మడానికి నాట్‌పాజిబిల్‌గానూ అనిపిస్తోంది. ఇంతకీ నువ్వు ఆ మేనేజర్‌కి చెప్పకూడని ఆ అసలు కారణం ఏమిటీ?" అడిగాడు గిరి, తట్టెడు ఆశక్తిని కళ్ళలో నింపుకుని మరీ.

"అసలు విషయం ఏవిటంటే, ఆ ప్రమోషన్ వెనక పెద్ద ఎమోషనల్ డ్రామా ఉందిలే... అందుకే నెమ్మదిగా ప్రమోషన్ వద్దనేసి వెనక్కి వచ్చేసాను. ఆవిడకు నా మీద క్రష్షో, ఆకర్షణో, ప్రేమో ఏదో ఉంది... అందుకే గత రెండు నెలలుగా నన్ను వాట్సాప్‌లోనూ, ఫేస్బుక్ లోనూ అప్పుడప్పుడూ సందేశాలతో వెంటాడుతోంది... కానీ నేను ఆమెనీ, ఆమె మెసేజెస్‌ని అంతగా పట్టించుకోలేదు... మన ఆఫీసులో కొంతమంది కూడా ఇదే విషయం నాకు చెప్పారు, ఆమె నన్ను ప్రేమిస్తోందీ అని!... ఇప్పటి వరకూ నేను ఆమెతో సరిగ్గా మింగిల్ అవ్వకపోయేసరికి, ఆమెకి నేను కాస్త దగ్గరగా ఉండాలని, ఇలా నన్ను ముందుకు జరిపి, మేనేజర్ లిస్టులో నా పేరుని మొదటి ప్లేస్‌లో పెట్టింది. ఇప్పుడు గానీ నేను ఆవిడ కింద పని చేస్తే... నా గొయ్యి నేనే నా చేతులారా తవ్వుకున్నట్టు. ఎందుకంటే, కాస్త సరదాగా ఆమెతో మెలిగితే, ఆమె నన్ను అపార్థం చేసుకుని నేనూ ఆమెని ప్రేమిస్తున్నానని అనుకోవచ్చు. అలా అని ఆమె కింద పని చేస్తూ, ఆమెతో అంటీ ముట్టనట్టుంటే, ఆమెకి నామీద కోపం పెరిగి, వేరే పనిష్మెంట్ ప్రోసెస్‌కి నన్ను మార్చేయొచ్చు. అలా ఆమె ప్రేమని అవునన లేక, ఇటు కాదనలేక ఆవిడతో సరిగ్గా మూవ్ అవలేక సతమతం అయిపోవాలి. అన్నిటికీ మించి, ఆవిడ రికమండేషన్‌తో వచ్చిన ప్రమోషన్ తీసుకుంటే... టీం ముందు చులకన కూడానూ. అందుకనే, అన్నీ ఆలోచించి... ప్రమోషన్ తీసుకుని ముందుకు వెళ్లడం కన్నా, తప్పుకుని... వెనకడుగేయడం మంచిదనిపించింది." చెప్పాడు చిన్నగా నవ్వుతూ.





# అపాయంలో ఉపాయం

పద్మ పైడిమర్రి
7675045608

**“ఏమండీ!!... మా పిన్ని కూతురు పెళ్లికి వెళ్ళాలనుకున్నాం కదా!.. ఇంకా తయారవ్వలేదేమిటి?! అదే మీ వాళ్ల ఇంట్లో పెళ్లి అయితే... పెళ్లికొడుకు కన్నా ముందుగా తయారై కూచుంటారు. మా వాళ్ళు అనేటప్పటికి వీలైనంత ఆలస్యం చేస్తారు. ఎంత బాగా చూసినా మీ బుద్ధి మారదు.” అంటూ దండకం మొదలు పెట్టింది రాధ.**

“నువ్వు ఎంత అరిచినా... ఆ హల్దీలు, సంగీత్, అందరూ కలసి డ్యాన్స్ చెయ్యడాలు... నా వల్ల కాదు. ముందు నువ్వు వెళ్లి ఎంజాయ్ చెయ్. నేను తరవాత వస్తా!” అన్నాడు గోపాలం.

“మరి కిందటినెలలో, మీ మేనమామ కూతురి పెళ్లిలో మీ వాళ్లందరితో కలసి పిచ్చి డాన్సులు తెగ చేసారుగా!! అప్పుడేమైందో?...” అంది రాధ.

“నువ్వే అంటున్నావుగా పిచ్చి డ్యాన్స్ అని, అందుకే ఇంకెక్కడా చెయదలచుకోలేదు.” అన్నాడు గోపాలం నవ్వుతూ.

“నిజమేలెండి! మీరు వచ్చి మొహం మాడ్చుకుని కూచునే కన్నా తరువాత రావడమే నయం.” అంటూ పెళ్లికి బయలుదేరింది రాధ.

“నేను నా బట్టలు అన్నీ తీసుకుని వెడుతున్నా. మీ బట్టలు మీరు సరిగ్గా సర్దుకురండి. మగపెళ్లివారిని ఆహ్వానించేటప్పుడు, స్నాతకానికి, ఎదురుసన్నాహాలకీ, పొద్దున్నా, రాత్రి, భోజనాలకు, అలా అన్నిటికీ విడివిడిగా ఒకొక్క జత పెట్టుకోండి.” అని చెప్పింది రాధ.

“ఇలా అస్తమానం బట్టలు మార్చుకుంటుంటే పెళ్లి పనులు ఎలా చేస్తాం?... పెళ్లి ఎప్పుడు చూస్తాం!” అన్నాడు గోపాలం చిరాగ్గా.

“చెప్పింది అర్థమైందిగా... వెడుతున్నా! తొందరగా వచ్చేయ్యండి.” అని పెళ్లికి వెళ్ళిపోయింది రాధ తనని కాదన్నట్టు.

‘హమ్మయ్యా!! తుఫాను వెలిసినట్టు వుంది.’ అనుకుంటూ భోజనం చేసేసి టీవీ పెట్టుకుని కూర్చున్నాడు గోపాలం. ఇంక పడుకుందాము అనుకునే సమయానికి ఫోన్ మోగింది.

ఫోన్ చూసి ‘అమ్మో రాధ !! ఇప్పుడు చేసింది ఏమిటీ? కొంపతీసి ఇప్పుడే రమ్మనదుకదా!’ అనుకుంటూ “ఏంటి? రాధా! ఫోన్ చేశావు?” అన్నాడు నిద్రలో వున్నట్టుగా.

“మరీ ఎక్కువ నటించెయ్యకండీ! మీరు అప్పుడే పడుకోరని తెలుసు. హల్దీ అప్పుడు అందరం పసుపు రంగు చీరలు కట్టుకుందామనుకున్నాం... నా పసుపురంగు చీర బీరువాలో వుండి పోయింది. అది తీసి రాపిడోలో పంపించండి. పసుపు మీద ఎర్ర చుక్కలు వుంటాయి.” అంది రాధ.

“అబ్బా!! అవన్నీ నాకేమి తెలుస్తాయి?” ఏదో ఒకటి కట్టుకో అన్నాడు గోపాలం.

“అదే తెలుస్తుంది! ముందు బీరువా తియ్యండి.” అంది రాధ.

బీరువా తెరిచిన గోపాలానికి అది చిన్న బట్టల కొట్టులా అనిపించింది. అందులోంచి ‘పసుపు మీద ఎర్ర చుక్కలా!... తియ్యగలనా?’ అనుకున్నాడు గోపాలం.

“కనిపించిందా?” సరిగ్గా చూడండి అంది రాధ.

“చూసానే... తెలియడంలేదు.” అన్నాడు గోపాలం దిగులుగా.


“ఎలా తెలుస్తుందీ?... ఎప్పుడైనా నేను కట్టుకున్నప్పుడు చూసి మెచ్చుకుంటే... అర్థమై చస్తుంది. ఆ పేపర్లోంచీ తలెత్తరు. ఇప్పుడెలా తెలుస్తుంది?” అంది రాధ కోపంగా.

“హమ్మయ్య! కనిపించిదే! పసుపుమీద ఆకు పచ్చ పువ్వులు వున్నాయి.” అన్నాడు గోపాలం మొత్తానికి సాధించాను అన్నట్టుగా.

“నా ఖర్మ! పువ్వులు కాదండీ, ఎర్రచుక్కలు. మీ వల్ల కాదుగానీ, నేను ఏదో ఏడుస్తా, కనీసం మీ మరదలికి కిందటిసారి నేను దసరాకి కొనుక్కున్న చీర నచ్చిందట. నీలానికి ఎరుపు అంచు అదైనా చూడండి... లేకపోతే మన పరువు పోతుంది.” అంది రాధ ధుమధుమ లాడుతో.

“ఏంటీ?!... చీర దొరక్కపోతే! పరువు పోతుందా?’ అని ఆశ్చర్య పోయాడు గోపాలం.

ఈసారి ఎలాగైనా పరీక్షలో పాస్ అవ్వడానికి చాలా తీవ్ర కృషి చేసాడు గానీ... పాపం పాస్



అవ్వలేకపోయాడు గోపాలం.

ఇంతలో ఫోన్‌లోంచీ 'బాబాయ్! నాకు పిన్నిది ఆరంజ్ ప్లెయిన్ చీర వుంది కదా!... అది పంపించవా?' అని ముద్దుగా అడిగింది రాధ చెల్లెలి కూతురు.

"వింటున్నారా?... నా పుట్టినరోజుకి కొనుక్కున్న చీర అది... గుర్తుందా?" అంది రాధ.

"గుర్తు రావడంలేదు... అయినా చెయ్యి లాగేస్తోంది, వెతకలేక పోతున్నా. నా వల్ల కాదే." అన్నాడు గోపాలం ఏడుపు గొంతేసుకుని.

"అవును లెండి!! అంత జ్ఞాపకశక్తి వుంటే... ఏ కలెక్టరో అయ్యేవారు... దేనికైనా అదృష్టం వుండాలి. నా రాత ఇలా వుంటే ఏమిచేస్తాం?! అందరిలో తలెత్తుకోకుండా చేసారు!" అంటూ కోపంగా ఫోన్ పెట్టేసింది రాధ.

గోపాలానికి ఏమీ చెయ్యాలో అర్థంకాలా.

'ఇది తన తెలివితేటలకే పరీక్ష. ఎలాగైనా రాధకి అడిగిన చీరలు చేరాలి... రేపు పెళ్లిలో అందరిముందు రాధ నుంచీ ఎదురయ్యే అపాయం నుంచీ తను ఎలాగైనా ఉపాయంగా తప్పించుకోవాలి అనుకున్నాడు.'

అక్కడ పెళ్లివారి ఇంట్లో పనుల్లో హడావిడిగా వున్న రాధను వాళ్ళ నాన్న 'రాధీ! ఒకసారి ఇలా రామ్మా!! నీకు ట్రక్‌లో పెద్ద బీరువా వచ్చిందే. నువ్వు సంతకం పెడితే గాని దింపడంట.' అని అరిచాడు.

అంతే!! ఆ అరుపు విని రాధతో పాటు అందరూ బీరువా రావడం ఏమిటి? ఎవరు పంపారో?... అనుకుంటూ బయటకు పరిగెత్తుకుని వచ్చారు.


తన ఇంట్లో వుండవలసిన బట్టల బీరువా, అలా ట్రక్‌లో చూసేసరికి రాధకు ఏమీ అర్థంకాలా.

"అమ్మా!! ఈ బొకే గూడా మీకే!" అంటూ బీరువా తెచ్చిన అతను రాధ చేతిలో బొకే పెట్టాడు.

బొకేకి ఒక చిన్న కార్డు, దానిమీద ఎవరికి నచ్చిన చీర వాళ్ళు కట్టుకోండి...

ప్రేమతో, గోపాలం. అని వుంది.

అది చదివిన రాధ నోట మాట రాక వుండిపోయింది.



# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## ఆశకూ హద్దుండాలి!

**దేవానంద్ తను ఈ జన్మలో జైలుకు వస్తాననీ ఇక్కడ చిప్పకూడా తినాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. మరి ఆ దుస్థితి ఎందుకొచ్చిందో తెల్సుకుందామా... మరైతే ఛలో ఫ్లాష్ బ్యాక్!**

దేవానంద్ రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తుంటాడు. ఆ మధ్య కోటి రూపాయలకు ఓ పాత యిల్లు కొన్నాడు. దాని మొహం మీద నాలుగు రంగులు కొట్టాడు... ఇక హీనపక్షం కోటీ ముప్పైలక్షలకైనా అమ్మాలనుకున్నాడు. మంచి ముహూర్తం చూసుకుని దాని ముందు 'హౌస్ ఫర్ సేల్' అని పెట్టాడు.

ఆ బోర్డ్ పెట్టి ఇరవై నాలుగు గంటలు గడవక ముందే ఆ ఇల్లు కొనడానికి సత్యం అనే ఆయన వచ్చాడు.

ఆయనతో ఆ ఇంటి రేటు కోటీ యాభై లక్షలు అని చెప్పాడు... హాఫ్ డే బేరమాడి చివరికి కోటీ నలభై లక్షలు ఇవ్వగలనని చెప్పాడు సత్యం... అయిష్టంగా బయటికి నటిస్తూ ఆఫ్ ద రికార్డ్ సంతోషిస్తూ... 'సరే' అన్నాడు దేవానంద్.

సత్యం అనే ఆయన రెండు నెలల్లో మిగతా డబ్బులు ఇచ్చి ఆ ఇంటిని తన పేర రిజిస్టర్ చేసుకునేట్టు అడ్వాన్స్ ఇచ్చి సేల్ డీడ్ అగ్రిమెంట్ రాసుకున్నాడు.

ఊహించిన దానికంటే ఎక్కువ లాభం వస్తున్నందుకు దేవానంద్ డబుల్ హ్యాపీ ఫీల్ అయ్యాడు.

కాలచక్రంలో నెల రోజులు స్పెండ్ అయిపోయాయి...ఇంతలో సుబ్బారావ్ అలియాస్ సుబ్రో అనే నాన్ రెసిడెంట్ ఇండియన్ దేవానంద్ ఇంటికి వచ్చాడు.

సత్యంకు అమ్మిన హౌస్ తనకు కావాలనీ అది కొనడానికే తను అమెరికాలోని చికాగో నుండి వచ్చినట్టు దేవానంద్‌తో చెప్పాడు.

ఆ ఎన్నారై మాటలని బట్టి చూస్తోంటే ఆ ఇంటిని సత్యమనే క్యాన్డేట్‌కి దేవానంద్ అమ్మడానికి అగ్రిమెంట్ చేసుకున్నాడన్న సంగతి తెలీనట్టు స్పష్టమైంది.

" ఆ ఇంటిని ఒకాయన కోటీ డెబ్బై లక్షలకు కొంటామని అడ్వాన్స్ కూడా ఇచ్చారు. " అని సగం అబద్ధం చెప్పాడు దేవానంద్.

"నేను రెండు కోట్లు ఇస్తాను. ఆ ఇల్లు నాకు కావాలి. ఎందుకంటే నేను అమెరికా వెళ్ళక ముందు ఆ ఇంట్లో పుట్టి పెరిగాను. అప్పుడు మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండదంతో ఆ ఇంటిని తప్పని సరి పరిస్థితిల్లో అమ్ముకుని అమెరికా వెళ్ళిపోయాను. అక్కడ ఉన్నాననే మాటే గానీ అనుక్షణం ఆ ఇంటి నోస్టాల్జియా నన్ను హంట్ చేస్తోంది...అందుకే అమెరికాలో కష్టపడి సంపాదించిన డబ్బంతా తీసుకొచ్చాను. మీరు నా సెంటిమెంట్‌ని అర్థం చేసుకుని ఆ ఇల్లు నాకే అమ్మాలి. ప్లీజ్!" అని బతిమాలుకుంటూ దేవానంద్ కాళ్లు పట్టుకున్నాడు సుబ్రో.

"సరే! వాళ్ళకి ఏదో ఒకటి చెప్పి కన్విన్స్ చేసుకుంటాను... మరి నువ్వు రెండు కోట్లు ఇమీన్ టూ సీయార్.... గ్యారంటీగా ఇస్తావు కదా?" అని అడిగాడు దేవానంద్.

"ఇప్పుడే పాతిక లక్షలు అడ్వాన్స్ ఇవ్వమంటారా?" అని బ్యాగులో తీసి ఇవ్వబోయాడు సుబ్రో.


"ఇప్పుడే అక్కర్లేదు!... వాళ్ళని ఒపించుకున్నాక చెబుతాను... అప్పుడిద్దువు!" అని అన్నాడు దేవానంద్.

మరుసటి రోజు తిరుపతి లడ్డు తీసుకుని సత్యం ఇంటికి వెళ్ళాడు దేవానంద్.

అది ఇచ్చి... "సత్యం గారు!... నన్ను మీరు క్షమిస్తానంటే ఓ విషయం చెబుతాను!" అని అన్నాడు దేవానంద్.

"ఏంటీ! మీ ఇల్లు నాకు అమ్మలేను... అని చెప్పడానికి వచ్చారా ?" అని బ్లేటెంట్‌గా అడిగాడు సత్యం.

" ఔనండి! మా ఆవిడ ఆ ఇల్లు అమ్మద్దని ఒకటే గొడవ చేస్తోంది... ఆ ఇల్లు కొన్నప్పటి నుండి మాకు బాగా కలిసొచ్చింది.మా కొడుక్కి మగబిడ్డ పుట్టాడు. నా కూతుర్ని గవర్నమెంట్



ఉద్యోగం చేసే ఓ అబ్బాయి కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నాడు. నాకు ఎన్నో ఏండ్లుగా వున్న పైల్స్ రోగం నయమైంది... మా ఆవిడకు వున్న మోకాళ్ళ నొప్పులు..." అని ఇంకా చెప్ప బోతుంటే సత్యం అడ్డు తగిలి...

"మిస్టర్ దేవానంద్ జీ!... నేను ఇష్టంగా భావించే తిరుపతి లడ్డు తెచ్చినప్పుడే మీరు ఇలాంటి హిడెన్ ఎజెండాతో వచ్చుంటారని ముందే ఎక్స్పెక్ట్ చేశా! నేను మీ ఇల్లు కొనడానికి వచ్చిన రోజు మీ శ్రీమతి మీ ఇంట్లో వుంది. నాకు చెత్త టీ కూడా చేసి ఇచ్చింది... ఆ ఘటన మీరు మర్చిపోయినట్టున్నారు. ఇంకో విషయం... ఈ భూప్రపంచంలో పెళ్ళానికి తెలియకుండా ఇలాంటి పన్లు మొగుడనే శాల్తీ చేస్తాడనుకోను! నాకు తెల్సి నాకంటే మీకు మంచి బేరం వచ్చినట్టుంది. అందుకే ఇలాంటి ఇండీసెంట్ వేషాలు వేస్తున్నారని నాకు బాగా అర్థమైంది. ఇంకో పాతిక రోజుల్లో మన సేల్ డీడ్ ప్రకారం మీ ఇల్లు నేను రిజిస్టర్ చేసుకుంటాను... ఆ రోజు రిజిస్టర్ ఆఫీస్‌లో కల్సుకుందాం. ఇక వెళ్ళండి!" అని నిర్మోహమాటంగా చెప్పాడు సత్యం.

అందరూ బాగుంది అనే సినిమాకు కలెక్షన్లు లేకపోవడం వల్ల బాధపడే నిర్మాతలా దేవానంద్ ఇంటిదారి పట్టాడు.

అప్పనంగా అరవై లక్షలు చేజారిపోవడంతో దేవానంద్‌కు సరిగా నిద్ర పట్టడం లేదు... తనకిష్టమైన రాగి సంగటీ నాటుకోడి పులుసు కూడా తినలేని పరిస్థితి నెలకొంది.

ఇలాంటి కండీషన్‌లో... "ఎల్లుండి రిజిస్టర్ ఆఫీస్‌కు వచ్చేయండి...రిజిస్టర్ చేసుకుందాం!" అని దేవానంద్ కు సత్యం ఫోన్ చేసి చెప్పాడు.

తీవ్రమైన బాధలో వున్న దేవానంద్ 'సరే' అనే మాట కూడా అనలేకపోయాడు.

దేవానంద్ అదృష్టం కొద్దీ మరుసటి రోజు సత్యం ఇంట్లో దొంగతనం జరిగింది... కోటి రూపాయల పైనే దొంగలు ఎత్తుకెళ్ళినట్టు తెల్సింది.

పరామర్శించటానికి సత్యం ఇంటికి వచ్చిన దేవానంద్‌తో– "దేవానంద్‌గారు! మా ఇంట్లో దొంగతనం చేసిన వాళ్ళమీద కేసు పెట్టాను... వారం రోజుల్లో ఆ దొంగల్ని పట్టుకుంటామని

## నవ్వేమందు

ప్రసిద్ధ






పోలీసువారు కాన్ఫిడెంట్‌గా చెప్పారు... ఆ తర్వాతే మనం రిజిస్టర్ పెట్టుకుందాం. ప్లీజ్!" అని లిటరల్‌గా గుడి ముందు భిక్షగాళ్ళా వేడుకున్నాడు సత్యం.

"న్నథింగ్ డూయింగ్! రేపటిలోగా నువ్వు నాకు ఇవ్వాల్సిన అమౌంట్ ఇచ్చి రిజిస్టర్ చేసుకోకపోతే మన సేల్ డీడ్ అగ్రిమెంట్ క్యాన్సిల్ అవుతుంది." అని ఫిల్టర్ లేకుండా తన మనసులో వున్నది వున్నట్టు చెప్పి వాళ్ళు ఇచ్చిన ఫిల్టర్ కాఫీ తాగి వెళ్ళిపోయాడు దేవానంద్.

కనికరం లేని దేవానంద్ ప్రవర్తనకు బాధిత సత్యం బాధపడ్డాడు.

సత్యం రిజిస్టర్ చేసుకోవాల్సిన తేదీ దాటిపోయింది. దాంతో దేవానంద్ ఇంటర్నల్‌గా పండగ చేసుకున్నాడు.

దరిమిలా సుబ్రోతో దేవానంద్ తన ఇంటిని రెండు కోట్లకు అమ్మేయడానికి డీల్ కుదుర్చుకున్నాడు.

మరుసటిరోజు దేవానంద్ తన ఇంటిని సుబ్రో పేర రిజిస్టర్ చేయడానికి రిజిస్టర్ ఆఫీస్‌కు వచ్చాడు. ఇంతలో పోలీసులు వచ్చి దేవానంద్‌ని అరెస్ట్ చేసి తీసుకెళ్ళబోతుంటే...

ఇల్లు రిజిస్టర్ అయ్యాక దేవానంద్‌ని అరెస్ట్ చేసి తీసుకెళ్ళమని పోలీసు వాళ్ళ మీద సుబ్రో సీరియస్ అయ్యాడు. పోలీసులకు ఎదురు తిరిగితే ఎలా కొడతారో సుబ్రోగారు అనుభవపూర్వకంగా తెల్సుకున్నాడు.

ఇకపోతే దేవానంద్ అరెస్ట్‌కు కారణం...

దేవానంద్ తనకి తెల్సిన దొంగలిద్దరికీ ఐదు లక్షలు రెమ్యూనరేషన్ ఇచ్చి సత్యం ఇంట్లో దొంగతనం చేసేట్టు మాట్లాడుకున్నాడనీ... వాళ్ళు దొంగతనం చేసిన అమౌంట్‌లో తనకి షేర్ ఏ మాత్రం వద్దనీ మొత్తం దొంగలే తీసుకునేట్టు ఆఫర్ ఇచ్చినట్టు దొరికిన ఆ దొంగలు పోలీసువారితో సిన్సియర్‌గా, డిటైల్డ్‌గా చెప్పినట్టు తెల్సింది.

మొదట ఆ దొంగలకు తనకీ ఎటువంటి రిలేషన్ లేదని దేవానంద్ బుకాయించాడు.

కానీ పోలీసులు మూడవ డిగ్రీ ప్రయోగించడంతో దేవానంద్ కాస్త సత్య హరిశ్చంద్రుడిలా మారి... తనే ఆ 'దొంగతనం' మాస్టర్ ప్లాన్‌కి సూత్రధారి అని ఒప్పుకున్నాడు.

జైల్లో ఉడికీ ఉడకని అన్నం తింటూ... దోమలతో కరిపించుకుంటూ... నిద్రలేని రాత్రులు గడుపుతూ వున్న దేవానంద్ 'ఆశకూ హద్దు వుండాలి' అని అనుకున్నాడు.



# బహుమతి గ్యారంటీ



పేట యుగంధర్
9492571731


**షిరిడీ యాత్ర పూర్తి చేసుకుని, ముంబైలో ఉంటున్న తన చిన్ననాటి స్నేహితుడైన భార్గవ్‌కృష్ణతో రెండు రోజులు సరదాగా గడుపుదామని అనుకున్నాడు గౌతమ్‌కృష్ణ.**

**స్టేషన్లో దిగిన గౌతమ్‌ను సాదరంగా ఆహ్వానించాడు భార్గవ్.**

**గౌతమ్‌కు చిన్నప్పటినుండీ కథలంటే పిచ్చి. ఎప్పటికైనా పేరుమోసిన కథకుడు కావాలన్నది అతని ఆశయం. పదవ తరగతి తర్వాత ఉద్యోగరిత్యా భార్గవ్ తండ్రికి బదిలీ కావడంతో భార్గవ్ పట్టణం కాలేజీలో ఇంటర్మీడియట్... ఆ తర్వాత ఇంజనీరింగ్ చేరాడు. చదువు పూర్తవగానే ముంబైలోని ఒక మల్టీనేషనల్ కంపెనీలో ఇంజనీరుగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు.**

గౌతమ్ ఆ చిన్న పల్లెలోనే చదువుకుంటూ, పెద్ద రచయిత కావాలని కలలుకంటూ టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశాడు...అనేకానేక దండయాత్రల అనంతరం టీచర్ ఉద్యోగం సంపాదించి, తన జీవితాశయాన్ని నెర వేర్చుకోవడం కోసం 'కృష్ణ' అనే కలం పేరుతో చిన్న చిన్నగా కథలు రాయడం మొదలు పెట్టాడు.




"ఏమిట్రా! ఎలా ఉంది నీ కథాప్రయాణం?" గౌతమ్ ను అడిగాడు భార్గవ్.

"దిగితే గానీ లోతు తెలీదన్నట్టు... కథలు రాయడం సులభమేమీ కాదు! ఎలాగోలా కష్టపడి రాసినా, అవి పత్రికల్లో ప్రచురణకు నోచు కోవడం మరీ కష్టం." నిస్తూరంగా చెప్పాడు గౌతం.

"ఏమిట్రా! మరీ అంత నిరుత్సాహంగా మాట్లాడుతున్నావు?"

"రచయితగా పేరు ప్రఖ్యాతలు పొందాలంటే దేశవిదేశాల్లో పేరు మోసిన పెద్ద పత్రికల్లో బహుమతులు గెలుచుకోవాలి... అప్పుడే ఈ సమాజం మనల్ని రచయితగా గుర్తిస్తుంది. లేకుంటే పూచికపుల్లలా పక్కన పడేస్తుంది." చెప్పాడు గౌతమ్.

"మరైతే, నువ్వు కూడా ఒక గొప్ప కథ రాసి... పెద్ద బహుమతి గెలవడానికి ప్రయత్నించు! అప్పుడు అందరూ నిన్ను గొప్ప రచయితగా గౌరవిస్తారు." సలహా ఇచ్చాడు భార్గవ్.

"గొప్ప కథ రాయడం ఎంత కష్టమో, దానికి బహుమతి పొందడం అంతకన్నా కష్టం. పత్రికలవాళ్ళు, న్యాయనిర్ణేతలు కలసి, బహుమతు లను అమ్ముకుంటారని, కులం, వర్గం పట్టింపులు పాటిస్తూ... తమ అనునయాలను అందలం ఎక్కిస్తారని, అన్ని రంగాల్లాగే సాహిత్య రంగం కూడా కలుషితమైపోతూ ఉందని పాతికేళ్లుగా పేరు పొందలేని ఒక రచయిత మిత్రుడు నాతో చెప్పాడు." వాపోయాడు గౌతమ్.

"ముల్లును ముళ్ళుతోనే తీయాలన్నట్టు, మనం కూడా అదే పంథాలో ముందుకు వెళదాము! ముంబైలోనే నాకు తెలిసిన ఒక పత్రిక వారు కథల పోటీ పెడుతున్నారు... ఆ పత్రిక ఎడిటర్ చాలా యేళ్లుగా మా కంపెనీ కస్టమర్. నువ్వు ఒక మంచి కథ రాసి పంపు. నీ కథకు బహుమతి వచ్చేలా నేను సిఫార్సు చేస్తాను. ఆ బహుమతితో నీ పేరు ప్రఖ్యాతలు ప్రపంచానికి తెలుస్తాయి!" అంటూ పోటీ ప్రకటనను గౌతమ్ చేతిలో పెట్టాడు భార్గవ్.

ప్రకటన ఆసాంతం చదివి బేలగా నవ్వాడు గౌతమ్.

"నిబంధనల్లో ఆఖరి వాక్యం నువ్వు చదివినట్టు లేదు... కేవలం ప్రవాసాంధ్ర రచయితలు మాత్రమే పోటీలో పాల్గొనాలని ఉంది!" అన్నాడు గౌతమ్.

"ప్రవాసాంధ్రులు అంటే ఏమిటి?..." ఆశ్చర్యంగా అడిగాడు భార్గవ్.

"రెండు తెలుగు రాష్ట్రాలల్లో కాక బయట ఉంటున్న వాళ్ళు!"

"నువ్వు ఇప్పుడు ఉన్నది ముంబైలో కదా! అంటే ప్రస్తుతానికి నువ్వు కూడా ప్రవాసాం ధ్రుడివే! నా అడ్రస్ పెట్టి, కథ రాసి పంపు. బహుమతి నీ పేరుపై వచ్చే గ్యారంటీ నాది!" అభయమిచ్చాడు భార్గవ్.

అతడు చెప్పినట్టే స్నేహితుని అడ్రసు, ఫోన్ నెంబరు పెట్టి తాను మూడునెలల పాటు ఎంత గానో కష్టపడి రాసిన ఓ కథను సదరు కథల

పోటీకి పంపించాడు గౌతం.

మరో రెండునెలలు గడిచిపోయాయి.

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కథల పోటీ ఫలితాలు విడుదలయ్యాయి. 'కృష్ణ' అనే కలం పేరుతో రాసిన కథకు మొదటి బహుమతి ప్రకటించారు పత్రికా సిబ్బంది.

ఆ విషయం తెలుసుకున్న భార్గవ్ కృష్ణ, అచ్చయిన ఆ బహుమతి కథను తన ఫోన్ ద్వారా గౌతమ్‌కృష్ణకు పంపించి, తన స్నేహితుడిని ఆనందపరచాలని అనుకున్నాడు. కథ కోసం చకచకా పేజీలను తిప్పి, రచయిత ఫోటో చూసి ఆశ్చర్యపోయాడు.


వెంటనే సదరు పత్రిక ఎడిటర్‌కు కాల్ చేశాడు.

"సార్! మీరు చెప్పినట్టే మీ కథకు మొదటి బహుమతి ప్రకటిస్తూ, మీ ఫోటోతో సహా కథను ప్రచురించాము." ఆనందంగా చెప్పాడు సదరు ఎడిటర్.

"ఆ కథ నేను రాసినట్టు నీకు నేను చెప్పానా? కథతో పాటు నా ఫోటో ప్రచురించమని నేను అడిగానా?" నిలదీశాడు భార్గవ్.

"అదేమిటి సార్! కృష్ణ అనే కలం పేరుతో వచ్చే కథకు బహుమతి ప్రకటించమని మీరు ప్రాధేయపడ్డారు కదా! పైగా ఆ కథ మీ అడ్రస్, ఫోన్ నంబర్‌తో వచ్చింది. మీ వాట్సాప్ డి.పి నుండి ఫోటో సేకరించి ఫోటోతో సహా కథ వేశాము. సంతోష పడక కంగారు పడతారేమిటి?" అని ప్రశ్నిస్తూ ఫోన్ కట్ చేశాడు ఎడిటర్.

తన స్నేహితుడు గౌతమ్ కృష్ణ మూడు నెలల పాటు కష్టపడి రాసిన కథకు తన పేరు, ఫోటో జతచేసి బహుమతి ప్రకటించిన పత్రిక వారిని ఏమీ అనలేక, జరిగిన తప్పుకు తన స్నేహితుడికి క్షమాపణ ఎలా చెప్పాలో అర్థం కాక జుట్టు పీక్కున్నాడు భార్గవ్ కృష్ణ.




**సమీక్షకు బహుమతి!**




ప్రముఖ రచయిత ప్రభాకర్ జైనీ రచించిన **'సర్దుకున్నారా?'** కథల సంపుటి ప్రచురితమయి ఇప్పటికి అయిదు సంవత్సరాలు అయింది. అయినప్పటికీ, ఇప్పటికీ నిత్యనూతనంగా ఉందంటూ మిత్రులు ప్రశంసిస్తుంటారు. ఈ 'సర్దుకున్నారా?' కథ చదివి మీ అమూల్యమైన అభిప్రాయాన్ని తెలియచేయండి. **బావున్న 100 సమీక్షలకు ఒక్కొక్కదానికి 1000 రూపాయల బహుమానం.** వాటితో ఒక పుస్తకం కూడా ప్రచురించి, ఏప్రిల్, 2025 న రవీంద్రభారతిలో ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరణ ఉంటుంది. 'సర్దుకున్నారా?' కథ మీకు గూగుల్లో వెతికితే దొరుకుతుంది. మూడు నాలుగు పేజీలకు మించకుండా రాయండి.

**డిశంబర్,31 లోగా... వర్డ్ ఫార్మెట్‌లో**
**prabhakarjaini.official@gmail.com** ఈ మెయిల్‌కి పంపండి



# దాన వీర శూర కర్ణ

ఆర్.సి.కృష్ణ స్వామి రాజు
9393662821

**చైత్ర పౌర్ణమి రోజు... వెండి వెన్నెల వెలుగులు ఊరంతా పరుచుకున్నాయి.**

**ఇంటి ముందర పట్టీల మంచంపైన కళ్ళు తెరుచుకుని పడుకుని ఉంది సుగుణక్క. ఆవకాయ ఊరగాయ చేయడానికి ఏమేమి సామానులు కావాలో ఆలోచిస్తూ ఉంది.**

**పక్కనే కళ్ళు మూసుకుని పడుకుని ఉన్న ఆరేళ్ళ మనవడు సుకుమారుడు గబుక్కున లేచి కూర్చుని– "అమ్మమ్మా... కండ్లు కనబడటం లేదే..." అన్నాడు.**

"ఓరి పిచ్చి ముఖమా!... కండ్లు మూసుకుంటే... ఎవరికైనా కండ్లు కనబడవురా..." అని బదులిచ్చింది.

"అవునా..." అంటూ జారిన దుప్పటి లాక్కొని పడుకున్నాడు.

నిద్రబోతున్న మనవడిని చూసి– 'ఎట్ల బతకబోతాడో ఈ అమాయకుడు' అనుకుంది.

ఎంతసేపటికీ నిద్ర రాలేదు. కొంచెంసేపు అటూఇటూ నడిచి మంచం మీద వాలింది.

ఆకాశాన్ని చూస్తూ సుగుణక్క– 'చంద్రుడేమో ఆకాశం మధ్యకి వచ్చినాడు. ప్రతినెలా పౌర్ణమిరోజున ఊరిలో సగం జనం సెకండ్‌షో సినిమాలకి వెళ్తారు కదా... పోయినోళ్ళు ఇంకా రాలేదు ఏమిటబ్బా...?' అని అనుకుంది.

అప్పుడే... చిన్నగా ఒక్కొక్కరు...

ఊరికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న పుత్తూరు నుంచి సినిమా చూసి వస్తూ ఉన్నారు.

సుగుణక్క చెవులకు 'ఘల్ ఘల్' శబ్దం వినబడింది.

కొద్దిసేపటికి ఆ శబ్దం పెద్దదయ్యింది.

టక్కుమని లేచి కూర్చుంది సుగుణక్క.

గజ్జెల గుర్రంలా ఎగురుకుంటూ వస్తున్న ప్రమీలను అడిగింది–

"ఏమి సినిమాకు పోయినారామ్మీ?" అని.

"ఇద్దరూ ఇద్దరే... రంగురంగుల సినిమాకి వెళ్ళినాము!" అని బదులిచ్చింది.

"బాగుందా?"

"మామూలుగా లేదక్కా!... బిడ్డలు లేనోళ్ళకు ఒకేసారి కవల పిల్లలు పుడితే ఎంత సంతోషంగా ఉంటుందో... అంత సంతోషంగా ఉంది నాకు. ఎందుకంటే... ఒకే సినిమాలో ఇద్దరు హీరోలు... శోభన్‌బాబు, కృష్ణంరాజులు. ఎంత అందంగా ఉన్నారో... రెండు కళ్ళూ చాల్లేదు అనుకో..."

పక్కనే ఉన్న ప్రమీల పెద్ద తమ్ముడు– "హీరోల గురించే చెబుతావే... హీరోయిన్లు ఏ పాపం చేసినారు... అక్కా సుగుణక్కా, చెమ్కీలా మెరిసే చంద్రకళ, మల్లె నవ్వుల మంజులను చూస్తా ఉంటే ఆకలీ, దాహమూ ఉండదక్కా!" అంటూ తియ్యటి గుటకలు మింగినాడు.

'అయినా నువ్వు సినిమాలకి రావేమి సుగుణక్కా!...వైకుంఠ ఏకాదశికి, మహాశివరాత్రికి... ఒకే టికెట్‌కు రెండు ఆటలు వేస్తే కానీ రావా... ఏమి?" అని పడీపడీ నవ్వుతూ అడిగింది ప్రమీల.

"పనులుండి రాలేదులే ప్రమీలా!" అని సర్ది చెప్పింది సుగుణక్క.

ప్రమీల చేతిలోని సినిమా పాటల పుస్తకాన్ని చూసిన సుగుణక్క..

"కొన్నావా?...నాకు ఇచ్చి పోరాదా... చదివి రేపు తెల్లారి ఇస్తాను."


"ఏమీ అనుకోవద్దక్కా!కొన్నాను కానీ... ఇంకా ఒక్క పాట కూడా నేర్చుకో లేదు... రాత్రంతా చదివి, రెండు మూడు పాటలైనా నేర్చుకుని రేపు తెల్లారికి తెచ్చి ఇస్తాలే..."

"అట్లే కానీ... నిదానంగానే తెచ్చి ఇవ్వు!..." అని నవ్వుతూ తల ఊపింది సుగుణక్క.

ప్రమీల పెద్దతమ్ముడి వైపు తిరిగిన సుగుణక్క– "ఎన్ని రీళ్ళ సినిమారా అది?" అని అడిగింది.

"పద్నాలుగు!" అని చెప్పి 'ఒళ్ళంతా వయ్యారమే పిల్లదానా...' ఇద్దరూ ఇద్దరే సినిమాలోని పాట పాడుకుంటూ చిటికెలు వేస్తూ వెళ్ళినాడు.

✦✦✦



వైశాఖ పౌర్ణమి రోజు...

వెన్నెల వర్షం కురుస్తున్నట్లుగా ఉంది...

నిద్రపట్టని సుగుణక్క మంచం మీద కూర్చుని పక్కనే ఉన్న మామిడి చెట్టుకున్న కాయల్ని లెక్క వేస్తోంది.

గబుక్కున నిద్ర లేచిన సుకుమారుడు కళ్ళు నలుముకుంటూ...

"అవ్వా!... నేను రేపు తెల్లారి ఆరేటమ్మ గుడికాడి చెరువుకాడికి వెళ్ళాలి!" అన్నాడు

"ఏముందిరా అక్కడ... తెల్లారే సరికి వెళ్ళడానికి?"

"కృష్ణా టాకీసులో ఆలీబాబా నలభై దొంగలు సినిమా ఆడుతోందంట కదా?"

"ఆడితే?..."

"ఆ సినిమాల్లోని గుర్రాలు నీళ్ళు తాగేదానికి తెల్లారికి చెరువుకాడికి వస్తాయంట కదా... మా మిత్రులందరూ వెళ్లి చూద్దామని..."

"ఓరి తిక్కలోడా... అది సినిమారా! తెర మీద గుర్రాలు కనబడతాయి కానీ నిజంగా అవి మన ఊరికి రావురా!"

"అలాగా?!..." అంటూ పక్కకి తిరిగి పడుకున్నాడు.

మళ్ళీ ఉలిక్కిపడినట్లు లేచి కూర్చున్నాడు.

"ఏమయ్యిందిరా?"

"గుర్రాలు పరుగెత్తి నాపైకి వచ్చినట్లు కలలు వస్తున్నాయే..." అన్నాడు.

ఇంట్లోకి వెళ్లి ఆంజనేయస్వామి దండకం పుస్తకం తెచ్చి సుకుమారుడి దిండుకింద పెట్టి 'ఇంక భయం లేదు' అని ధైర్యం చెప్పి పడుకోమంది.

అప్పుడే పరదేశి బావ సైకిల్ బార్ మీద కూతుర్ని, వెనుక సీట్లో



పెళ్ళాన్ని కూర్చోబెట్టుకుని వచ్చాడు.

చేత్తోనే సైకిల్‌ని ఆపింది సుగుణక్క.

"ఏ సినిమాకి వెళ్ళినారు?... ఎట్లా ఉంది సినిమా?" అని అడిగింది.

సైకిల్ మీదినుంచి ఎగిరి దుమికిన పరదేశి భార్య– "బంగారు బాబు సినిమాకి వెళ్ళినా మక్కా... అది మామూలు సినిమా కాదు... బంగారంలాంటి సినిమా... వాణిశ్రీ కట్టిన చీరలు, వేసిన గాజులు చూస్తా ఉంటే... ఎన్ని జన్మలెత్తితే అట్లాంటి చీరలు, గాజులు మనం వేసుకుంటామో..." అనిపించింది.

ఆసక్తిగా వింటోన్న సుగుణక్కతో– "నువ్వు హెలికాప్టర్ ఎప్పుడైనా చూసినావా అక్కా?" అని అడిగింది పరదేశి భార్య.

"కారే సరిగాచూడలేదు. హెలికాప్టర్‌ని ఎక్కడి నుంచి చూడగలను?" చెప్పింది సుగుణక్క.

"ఈ సినిమాలో హెలికాప్టర్‌లో ఫైటింగ్ సీన్లు పెట్టినాడక్కా... ఎంత బాగుందో..."

ఇంతలో...


పరదేశి బావ, కూతురిని సైకిల్ దించి...

"పాట పాడు పాపా.." అన్నాడు.

సందు దొరికింది చాలని ఆ పాప 'చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నది' అని పాడుతూ అక్కినేని వాణిశ్రీలా స్టెప్పు లేసింది.

ఒంటిమీదున్న దుప్పటి తీసి పారేసి సినిమా చూస్తున్నట్లు పాప డ్యాన్సు చూస్తూ... కూర్చు న్నాడు సుకుమారుడు.

పాప స్టెప్పులకు మురిసిపోయిన సుగుణక్క నాలుగు మామిడి కాయలు కోసి పాప చేతికి ఇచ్చింది.




మామిడి కాయలను చేతిలోకి తీసుకుంటూ ఆ పాప... "ఇంకా చాలా పాటలకు స్టెప్పులు వేయగలను నేను... మళ్ళీ వచ్చి స్టెప్పు లేసి వెళ్తా. అయితే ఈసారి, మీ చెట్టులోని జామ కాయలు కోసి ఇవ్వాలి." అని చెప్పింది.

అలాగేనని తల ఊపింది సుగుణక్క.

ముగ్గురూ సైకిల్ ఎక్కి వెళ్ళ బోతూ ఉంటే...

"ఎన్ని రీళ్ళ సినిమా ఇది?" అని అడిగింది సుగుణక్క

"పదహారు!" అని చెప్పిన పరదేశి చేతి రుమాలుని ఒక చేత్తో విసురుతూ ఒంటి చేత్తో సైకిల్ తొక్కు కుంటూ ఊర్లోకి వెళ్ళాడు.

✦✦✦

జ్యేష్ఠ పౌర్ణమినాడు...

చల్లటి చంద్రుడు మామిడి చెట్ల మధ్యన దోబూచులాడుతున్నాడు.

నిద్ర రాక మంచం మీద అటూఇటూ దొర్లు తున్న సుగుణక్క మనవడి చేతి మీద దోమలు ఉండటం చూసింది.

చేత్తో దోమల్ని కొట్టాలని... చేయి పైకి ఎత్తింది.

"వద్దు అమ్మమ్మా... వాటిని చంపొద్దు!!" అన్నాడు.

"నీ రక్తం తాగుతూ ఉంటే గమ్మున ఎలా ఉండేదిరా?"

"అమ్మమ్మా... ఆడ దోమలే అంట కదా మనల్ని కుట్టేది... మా మిత్రులు చెప్పారు. పోనీలే పాపం. ఆడవాటిని చంపేది దేనికి?"


"ఎంత జాలి గుండెరా నీది మనవడా... అంతా మీ తాత పోలిక!" అని ముద్దు పెట్టి "అయితే దుప్పటి బాగా కప్పుకో!" అని చెప్పి, దుప్పటిని నిండుగా కప్పింది మనవడి మీద.

ఇంతలో సినిమాకి వెళ్ళినవాళ్ళు గుంపులు గుంపులుగా వస్తున్నారు.

టక్ చేసుకుని టింగు టింగుమని వస్తున్న వితండం మామని నిలబెట్టింది సుగుణక్క.

"ఏ సినిమాకి వెళ్ళినారు... ఎలా ఉంది?" అని అడిగింది.

వితండం పెళ్ళాం ముందుకు వచ్చి... "దొంగలకు దొంగ సినిమాకి వెళ్ళినామక్కా! హీరో కృష్ణ చిలిపి చూపులు చూడ ముచ్చటగా ఉన్నాయనుకో!" అంది.




# కా.కా.క.క.

(కాకతాళీయ కార్టూన్ల కథా కమామీషు)



**ఒ**కే కార్టూన్ని పదిమంది కార్టూనిస్టులు కొద్ది మార్పులతో గీయడం జరుగుతుంది. చాలామంది అది 'కాపీ' కార్టూను కదా అనుకుంటారు. అలా అనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే ఒకే ఐడియా ఇద్దరు ముగ్గురు కార్టూనిస్టులకు రావడం సహజమే! అది 'కాకతాళీయం' మాత్రమే! **కాకతాళీయంగా గీసిన కార్టూన్లకు ఉదాహరణ ఈ శీర్షిక!** ఎవరు ముందు గీసారు? ఎవరు వెనుక గీసారు? అని కాకుండా ఇద్దరు కార్టూనిస్టులు ఒకే ఐడియాని ఎలా ప్రజెంట్ చేశారో తెలియ జేయడమే ఈ శీర్షిక ఉద్దేశం!




పక్కనే ఉన్న మొగుడు ఉరిమి చూసాడు.

'ఎందుకొచ్చిన గొడవ' అనుకుని... "మా ఇంటాయన చూపులు అచ్చం కృష్ణ చూపుల్లాగే ఉంటాయక్కా!" అని సర్ది చెప్పింది.

ఖుషీ అయినాడు వితండం.


"నిజమే... నా సావాసగాళ్ళందరూ నన్ను సూపర్ స్టార్ కృష్ణ బ్రదర్ వా అని అడుగుతూ ఉంటారు... సమాధానం చెప్పలేక చస్తూ ఉంటాను" అని చెప్పి కాలర్ సర్దుకున్నాడు.

హీరో కృష్ణలాగా అటూఇటూ... చేతులు తిప్పాడు. ఎవ్వరూ చూడటం లేదని తెలుసుకుని దొంగలకు దొంగ సినిమాలోని పాట... "సీతాపతీ, నీకు చిప్పే గతి..." అని పాడుకుంటూ రెండు అడుగులు వేశాడు.

"ఎన్ని రీళ్ళ సినిమా అది?" అని అడిగింది సుగుణక్క!

"పదికి ఏడు కలిపితే పదిహేడు!" అని చెప్పి చీర కొంగు తిప్పుతూ జయప్రదలాగా స్టైలుగా నడుస్తూ వెళ్ళింది వితండం మామ భార్య.

✦✦✦




ఆషాఢ పౌర్ణమి సాయంత్రం...

పంచాయితీ ఆఫీసుకాడ పిల్లకాయలతో కబడ్డీ ఆడుకుంటున్నాడు సుకుమారుడు.

పుల్ల వెంట్రుకల పరంజ్యోతి పరిగెత్తుకుంటూ వచ్చి– "ఒరేయ్ సుకుమారా... మీ అమ్మమ్మ నిన్ను ఇప్పటికిప్పుడే ఇంటికి రమ్మందిరా!" అని చెప్పి వెళ్ళింది.

"ఇంకొద్దిసేపు ఆడుకుని వెళ్తా!" అని ఆడుకుంటూనే ఉన్నాడు సుకుమారుడు.

పదో తరగతి చదివే ప్రకాషు వచ్చి–

"ఏమిరా సుకుమారా!... స్కేలు పెట్టి కొలిస్తే నాలుగు అడుగులు లేవు. పెద్దోళ్ళు పిలిస్తే పట్టించుకోవడం లేదు... కొత్తగా కొమ్ములు ఏమైనా వచ్చాయా?" అని సుకుమారున్ని భుజాల మీద వేసుకుని సర్రుసర్రున వెళ్ళి... ఇంటి ముందర దించినాడు.

ఒంటికి అంటిన మట్టిని విదిలించుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు సుకుమారుడు.

నూనెలో వేడివేడిగా మురుకులు కాలుస్తున్న అమ్మమ్మ కనిపించింది.

"ఆహాఁ!... ఈరోజు పండుగ నాకు!" అనుకుంటూ రెండు మురుకులు తీసుకుని నములుతూ పొయ్యి ముందరే కూర్చున్నాడు.

"ఒరేయ్ సుకుమారా... గబగబా గుడ్డలు

మార్చుకో... ఈ రోజు మనం సినిమాకి వెళ్తున్నాము!" అని చెప్పింది సుగుణక్క.


రెక్కలొచ్చి ఆకాశంలో ఎగురుతున్నట్లు అనిపించింది సుకుమారుడికి.

రెండుసార్లు సోప్ వేసి ముఖం కడుక్కున్నాడు.

చకచకా ఇస్త్రీ గుడ్డలు వేసుకుని కాళ్ళకు రబ్బరు చెప్పులు తొడిగి హీరో లెక్కన అమ్మమ్మ ముందర నిలబడినాడు.

"ఒరేయ్ సుకుమారా! సినిమావాళ్ళ కంట పడబాకరా నాయనా... గద్దలు తన్నుకెళ్ళినట్లు ఎత్తుకెళ్ళి నిన్ను సినిమాల్లో హీరోని చేసేస్తారు!" అని బుగ్గ మీద ముద్దుముద్దుగా గిల్లింది.

సుకుమారుడి మనసు దీపావళికి వెలిగించిన తారాజువ్వ అయ్యింది.




✦ ✦ ✦

చెరువు గట్టు మీద సుగుణక్క నడుస్తూ ఉంది.

మోకాళ్ళ నొప్పులున్న ఆడోళ్ళు తొక్కుడు రిక్షాలలో కూర్చున్నారు.

నడవలేని మగాళ్ళు ఎద్దుల బండి ఎక్కారు.

పైటలేసిన ఆడ పిల్లలు సీతాకోక చిలుకల్లా ఎగురుతూ నడుస్తున్నారు. వచ్చీరాని మీసాల కుర్రకారు పైట భామల్ని దోర చూపులు చూస్తున్నారు.

'వాళ్ళు చూస్తున్నారా లేదా...' అని ఆడ పిల్లలు ఓర చూపులు చూస్తున్నారు.

ఎర్రంచు చీర కట్టి తాంబూలం నోట పెట్టి మహారాణి లెక్కన నడుస్తోంది సుగుణక్క.

ఆవు వెనుక వెళ్ళే దూడలాగా... సుకుమారుడు అమ్మమ్మ వెనుకే నడుస్తున్నాడు.

సుకుమారుడి భుజానికి సంచి తగిలించి ఉంది... అందులో మొరమొర మురుకుల పొట్లం, వేయించిన వేరు శనగకాయలు, చిన్న విసనకర్ర, నీళ్ళ చెంబు ఉన్నాయి.

ఆకాశంలోని చంద్రుడు చెరువు నీళ్ళలోకి వచ్చి అవ్వా మనవడిని చూసి నవ్వుతున్నట్లుగా ఉన్నాడు.

చెరువు గట్టున రాలిపడి ఉన్న తాటి పండ్ల ఘమ ఘమ వాసనలు గుప్పు మంటున్నాయి.

"అమ్మమ్మా!... ఆరు నెలలుగా సినిమాకి తీసుకెళ్ళమంటే తీసుకెళ్ళలేదు... అదుగో... ఇదుగో...' అని చెప్తూ వచ్చావు. ఈ రోజు నేను అడగకపోయినా తీసుకెళ్తున్నావు. కారణమేమి?" అని ఒళ్ళంతా ఊగిస్తూ అడిగినాడు.

"ఒరేయ్ సుకుమారా... పీచు మిఠాయి వాడు, రూపాయికి కొంచెం మిఠాయి ఇస్తే సంతోష పడుతావా దండిగా ఇస్తే సంతోష పడుతావా?" అని అడిగింది.

"అనుమానమెందుకే అమ్మమ్మా!... దండిగా ఇస్తేనే కదా సంతోషం!" అన్నాడు.

"అందుకేరా... ఈ రోజు నిన్ను దానవీర శూర కర్ణ సినిమాకి తీసుకు వెళ్తున్నాను. అది మామూలు సినిమా కాదు... ఇరవై రీళ్ళ సినిమా. మూడు గంటలా ఇరవై నిమిషాలు నడుస్తుంది. అంతసేపూ మనం టాకీసులోనే ఉండొచ్చు. తనివితీరా సినిమాని చూడొచ్చు. దేశంలోనే ఇప్పటివరకు తీసిన సినిమాల్లో ఇదో పెద్ద సినిమా. 'దొరుకునా ఇటువంటి సినిమా' అని తీసుకు వెళ్తున్నాను..." అని చేతులు తిప్పుతూ చెప్పింది.


పీచు మిఠాయి గంప ముందర పెట్టినట్లు ఎగిరి గంతులేసినాడు సుకుమారుడు.

దూరంగా...

టాకీసు ముందర కటౌట్ లోని దుర్యోధనుడి పాత్రధారి ఎన్టీయార్ కిరీటం ధగధగా మెరుస్తోంది.





# సూపర్... బాసూ!

మార్లపూడి ఆనందకుమార్,
9490358767

**సుందరం బాగా చదువుకున్నాడు...**

**ఇంగ్లీషులో బాగా మాట్లాడగలడు. ఓ రోజు టిప్‌టాప్‌గా బట్టలు వేసుకుని ఒక పెద్ద హోటల్లోకి వెళ్ళి భోజనం చేసాడు.**

భోజనం చేసాక ఆ టేబుల్ మీద ఉన్న రెండు చెంచాలను తీసి సర్వరు చూస్తూండగానే ఏ మాత్రం అదురు బెదురు లేకుండా జేబులో వేసుకున్నాడు. సర్వరు... చుట్టుప్రక్కల వున్న కస్టమర్లు అతని చర్య చూసి విస్తుపోతున్నారు.

అతను అదేమి పట్టించుకోకుండా బిల్లు కట్టడానికి వెళ్ళాడు.

క్యాష్ కౌంటర్ దగ్గర రద్దీగా వుంది.

వాళ్ళందరి ఎదుట– "సార్!.. ఈ పెద్ద మనిషి టేబుల్ మీద వున్న రెండు చెంచాలు జేబులో వేసుకున్నాడు చూడండి!" అని సర్వర్ ఓనర్‌తో ఫిర్యాదు చేసాడు.

ఓనరు అతని విగ్రహ పుష్టి, వేషధారణ విధానం చూసి నమ్మీ నమ్మనట్లు... "ఏమిటి? సర్వరు చెప్పింది నిజమేనా?" అడిగాడు.


"నిజమే!" అన్నాడు.

అతని చుట్టుపక్కల నిలబడి చూస్తున్నవాళ్ళు ఆశ్చర్యపడ్డారు.

అప్పుడు ఆ యజమాని "ఇంతవయసు వచ్చింది. బాగా చదువుకున్న వాడిగా కనపడుతున్నావు ఇలా చెయ్యొచ్చా?" అని అడిగాడు.

ఓనరు అన్న మాటలు విని...

"ఏదో గొప్ప నేరం చేసినట్లు దొంగని పట్టుకున్నట్లు అడుగు తారేమిటి?...మొన్న నాకు సుస్తీ చేస్తే వైద్యం చేసి రోగం కుదిర్చిన డాక్టరు ఒక టానిక్ రాసిచ్చాడు. అది తెచ్చుకుని వాడాను. దాని మీద Take two spoons after meals అని రాసి వుంది...




మీ హోటల్‌లో భోజనం చేసాక... రెండు స్పూన్‌లు తీసుకున్నాను... ఇందులో నా తప్పేమిటి? డాక్టరుగారు చెప్పినట్టుగానేగా నేను చేశాను." అని అతను సీరియస్‌గా అన్నాడు.


అంతే!... ఆ హోటల్లో వున్న కస్టమర్లు ఫకాలుమని నవ్వారు.

ఆ హోటల్ ఓనరుకు నవ్వాలో ఏడ్వాలో తెలియక...

"మేం హోటల్ పెట్టిన ఇన్నాళ్ళకు భలే కస్టమర్‌వి దొరికావయ్యా!..." అని అతని చేతి లోని చెంచాలు లాక్కొని...

'చాల్లే ఇక పొమ్మన్నా'డు!







# అమ్మో!... ఇంకా నయం!

కొత్తపల్లి ఉదయబాబు
9441860161

**సూర్యకిరణం కళ్ళల్లో పడితే గాని మెలకువ రాని అలివేలు మంగతాయారు మొదటిసారి పండక్కి వచ్చిన వియ్యాలవారి సేవ కోసం ఐదింటికి అలారం పెట్టుకుని లేవక తప్పలేదు.**

**అప్పటికే లేచి ముఖం కడుక్కొని నుదుట చక్కగా బొట్టు పెట్టుకుని, మంచం మీద పడుకున్న వియ్యపురాలు సుబ్బలక్ష్మి మెలకువగానే ఉండి అలివేలు మంగతాయారును రహస్యంగా గమనించ సాగింది. అలివేలు మరెవరో కాదు. సుబ్బలక్ష్మికి రెండో మేనమామ కూతురే.**

అయిన వాళ్ల సంబంధం అయితే కుటుంబాల మధ్య రాకపోకలు బంధుత్వాలు బాగుంటాయని... ఇరువురి పెద్దలు అనుకోవడం వల్ల ఆవిడ కూతుర్ని సుబ్బలక్ష్మి కొడుకుకు ఇచ్చి కార్తికమాసంలో వివాహం జరిపించారు.

మంగ అదృష్టం ఏమిటంటే... చదివింది ఐదో తరగతి అయినా, రైల్వే ఇంజనీరు భార్య కావడం.

భర్తతో ఇటు కాశ్మీర్ నుంచి అటు కన్యాకుమారి వరకు రకరకాల ఊర్లకు ఉద్యోగం నిమిత్తం వెళ్లడం వల్ల నాలుగైదు భాషలు కూడా అవలీలగా మాట్లాడేస్తుంది.

సుబ్బలక్ష్మి చదివింది కూడా ఐదో తరగతే. ఆమె భర్త బడిపంతులు కావడం వల్ల ఏమో నాలుగైదు ఊళ్ళు తిరిగిన పరిజ్ఞానం తప్ప అలివేలు మంగతాయారు అంత మాటకారీ కాదు! ప్రపంచ అనుభవమూ లేదు!

ఫ్రిజ్‌లోంచి రెండు ప్యాకెట్ల పాలు తీసి గ్యాస్ పొయ్యి వెలిగించి, వియ్యపురాలు ఎక్కడ లేచి వచ్చేస్తుందేమో... అన్నంత కంగారుగా దగ్గరుండి పాలు కాచి, జానెడు పొడవున్నటువంటి దుక్కలాంటి స్టీల్ గ్లాస్ నిండా చిక్కటి బ్రూ కాఫీ కలిపేసుకుని, ఊదుకొని... ఊదుకుని మరీ తాగేసిన మంగ, పక్కనున్న మంచినీళ్ల బిందెలోంచి లోటా చెంబు నిండా మంచినీళ్లు తీసుకుని మిగిలిన పాలల్లో నిర్దాక్షిణ్యంగా పోసేసింది.

అది చూసిన సుబ్బలక్ష్మి "ఓసి నీ అసాధ్యం కూలా!" అనుకుంది మనసులో.

పొద్దున్నే కాఫీ చుక్క నాలుక మీద పడకపోతే, నాలుక పీకేస్తుంది... అనుకున్న సుబ్బలక్ష్మి.

"లేచావా వదినా!..." అనుకుంటూ వంటింట్లోకి వచ్చింది.

"ఎంత సేపు అయింది వదినా లేచి? ముఖం కడుక్కున్నావా? కాఫీ ఇవ్వనా?"అడిగింది మంగ.


"మీ అన్నయ్యగారికి నాలుగింటికి లేవడమే అలవాటు వదినా!... లేచిన వెంటనే కాఫీ చుక్కనాలుక మీద పెడితే గాని, ఆయనకి అవస రాలు తీరవు. నాకు అదే అలవాటు అయిపోయింది. నాలుగింటికే లేచి మొహం కడిగేసుకున్నాను. ఇంకా నువ్వు లేవలేదని మంచం మీద నడుము వాల్చాను. వంటింట్లో లైటు వేసిఉంటే మెలకువ వచ్చే సింది." అంది సుబ్బలక్ష్మి! చూపుడు వేలు అంత స్టీల్ గ్లాసులో, చేత్తో పంచదార వేసి, మూడోవంతు వరకు లఘుశంక ద్రవంలాంటి కాఫీ డికాషన్ పోసి, పై పావువంతు పాలు పోసి మరో స్టీల్‌గ్లాస్ తో సహా సుబ్బలక్ష్మికిచ్చింది మంగ.

"కాఫీలో పంచదార ఉజ్జయింపుగా వేసా వదినా! ఈ గ్లాస్‌తో తిరగ బోసుకో!" గ్రీన్ టీ నీళ్ళలాంటి కాఫీ ఉన్న గ్లాస్‌ని... వియ్యపురాలు సుబ్బలక్ష్మికి చెప్పింది అలివేలు మంగతాయారు!

"కలుపుకోవడానికి చెంచా లేదా వదినా?" అమాయకంగా అడిగింది సుబ్బలక్ష్మి.

"ప్రతినెలా రెండు డజన్లు చెంచాలు కొంటాను వదినా! వెధవ పని మనిషి... ఎలా మాయం చేస్తుందో ఎప్పుడు మాయం చేస్తుందో తెలియదు. నెల అయ్యేసరికి ఒక్క చెంచా కూడా కనబడదు." అంది మంగ.

"ఏ డబ్బాలో పెట్టిన చెంచా ఆ డబ్బాలో... ఆజన్మ ఖైదీని చేసి వదిలేస్తావు. బయటకి తీస్తే చావుకి సిద్ధమైన ఖైదీల్లా మాసిపోయి ఉంటాయి!" అప్పుడే లేచిన ఆమె కొడుకు శివమణి బాత్రూం లోకి వెళ్ళబోతూ... బద్ధకంగా ఒళ్ళు విరుచు కుంటూ అన్నాడు.



"పొద్దున్నే ఆడంగి మాటలు ఎందుకురా? వెళ్లి నీ పని చూసుకో!..." తల్లి మాటలకి టక్కున నోరు మూసి లోపలకు దూరాడు ఆ టీనేజ్ కుర్రాడు!

పంచదార పానకంలా ఉన్న ఆ కాఫీ నీళ్లని రెండుసార్లు గ్లాసులో అటు ఇటు తిరగబోసుకొని కాఫీలాంటిది ఏదో తాగాను అని సరిపెట్టు కుంది సుబ్బలక్ష్మి!

✦✦✦

వియ్యాల వారందరూ హాస్యపు చతురతతో, చమత్కార సంభాషణ లతో, మధ్యాహ్నం కలిసిమెలిసి భోజనాలు చేశారు.

భోజనాలయ్యాక మగవాళ్ళందరూ చతుర్ముఖ పారాయణంలో పడితే, పిల్లలందరూ ఆటల్లో పడ్డారు. మరి ముసలోళ్ళు టీవీ సీరియల్స్‌లో మునిగిపోయారు!

కాసేపు నడుము వాలుద్దాం అని సుబ్బలక్ష్మి అనుకునేటంతలో...

"అలా బజారుకి షాపింగ్ కి వెళ్ళొద్దాం రా వదినా!" అంటూ వచ్చిన మంగని చూసి నోట మాట రాలేదు.

ఇంట్లో పని చెయ్యడానికి వచ్చినవాళ్లకన్నా హీనంగా 'పనికిమాలిన చీరతో కనిపించినా, పనివాళ్లని ఆజమాయిషీ చేసే మేస్త్రీలా ప్రవర్తిం చిన మంగకి, ఈ మంగకి అసలు పోలికే లేదు.

ఖరీదైన పట్టుచీరతో సహా తలనుంచి కాళ్లవరకూ ప్రతీ వస్తువులోను మ్యాచింగ్‌తో లైట్ మేకప్ తో, పెదాలకు ఎర్రని లిప్-స్టిక్ తో తానెన్నడూ చూడని కొత్త మంగని చూసి కళ్లార్పడం మర్చిపోయింది సుబ్బలక్ష్మి.


"అదేమిటి వదినా!...అలా వింతగా చూస్తున్నావ్? ఇలా తయార య్యానేమిటీ అనా? ఈ విజయవాడలో ఇలా షాపింగ్‌కి వెళ్లకపోతే మనిషికి విలువే ఇవ్వరు వదినా... లేకపోతే ఇలాంటి హంగులు నాకు అస్సలు ఇష్టం ఉండవనుకో...రా!...మళ్ళీ వీళ్లంతా టీలు, స్నాక్స్ అని అడిగే లోపు వచ్చేద్దాం." అంది మంగ.

పక్కా పల్లెటూరిలో అయిదవ తరగతి వరకు చదివి 14 సంవత్స రంలో పెళ్లి చేసుకుని భర్త వెంట కాపురానికి వచ్చేసిన సుబ్బలక్ష్మికి పరాయి మగాడి ముందుకు వస్తూనే పమిట భుజాల చుట్టూ కప్పుకుని వచ్చే అలవాటు. అలాంటిది మంగ స్లీవ్‌లెస్ జాకెట్ వేసి పోటిగా ఉన్న జుట్టుని పైనుంచి బాబ్‌హెయిర్‌లా దువ్వి వదిలేసి, చీర ఒంటి పొరన పమిట కొంగు నేలన జీరాడేలా వేసిన వేషం చూసి-

"మీరు చాలా హై క్లాసు వదినా!" అంది కావాలని మెచ్చుకోలుగా!

"అంతా నీ అభిమానం. పద... పద...." బరువుగా ఎత్తుగా ఉన్న లేడీస్ పర్సుతో ముందుకు నడచిన ఆమెను అనుసరించింది సుబ్బలక్ష్మి - పర్సు చాలా ఎత్తుగా బరువుగా ఉంది. ఎన్ని వేలు షాపింగ్ చేస్తుందో అనుకుంటూ.

ముందుగా ఒక చీరల షాపులోకి వెళ్ళి అక్కడో వంద చీరలు తీయించి... "ఇవన్నీ కట్టి పడేసిన పాత చీరల డిజైన్సే...కొత్త వెరైటీ



రాలేదా?" అని అక్కడ లేని రకాలు అడిగి బయటకి వచ్చేసింది మంగ.


అలా నాలుగైదు షాపులు తిరిగి ఒక ఐస్‌క్రీం పార్లర్కి తీసుకువెళ్ళింది మంగ.

"ఇక్కడ రోజ్‌మిల్క్ చాలా బాగుంటుంది వదినా!... తాగితే వదలవు తెలుసా?" అని రెండు ఆర్డర్ చేసింది.

సుబ్బలక్ష్మికి చాలా సంతోషం అనిపించింది. ఇలా బయటకు వచ్చి డ్రింక్ అనేది తాగడం ఆమె జీవితంలో మొదటిసారి మరి.

"ఇంకోటి తాగు వదినా..." అంది మంగ.

"వద్దు వదినా!.. చాలా చాలా... బాగుంది. ఇంకోటి తాగలేను."




"అమ్మో ఇంకా బోలెడు షాపింగ్ ఉంది... నేను మొహమాట పడను బాబు..." అని ఇంకొకటి తెప్పించుకుని గడ గడా తాగేసింది మంగ.

డబ్బులు ఇవ్వడానికి కౌంటర్ దగ్గరకు వచ్చాకా "అయిదు వందల నోటుకు చిల్లర ఉందా వదినా నీ దగ్గర?" అని అడిగింది మంగ, సుబ్బలక్ష్మిని పర్సు తీయబోతూ.

"నా దగ్గర చిల్లర ఉందిలే..." అని మర్యాద కోసం ఇచ్చేసింది సుబ్బలక్ష్మి.

"ఇంటికి వెళ్ళాక చిల్లర తెప్పించి ఇచ్చేస్తాను వదినా!" అని ఎదురుగా కనిపించిన స్టీలు సామాను షాపులోకి దారి తీసింది మంగ.

"అయితే చీరలేమీ కొనుక్కోవా?..." అమాయకంగా అడిగింది సుబ్బలక్ష్మి.

"నిజానికి నాకు మధ్యాహ్నం పూట నిద్ర పట్టదు వదినా...రోజుకో పేటలో పదిషాపులు తిరిగినా...నెలలో అన్నీ చూడలేను అనుకో... నాకు బాగా నచ్చితేనే కొంటాను... రెండు బీరువాలనిండా ఆరు వందల చీరలదాకా ఉన్నాయ్. కట్టిన చీర కట్టడానికే రెండేళ్ళు పడుతుంది. ఆ షాపుల్లో చూసిన అన్నిరకాలు నా దగ్గర ఉన్నాయి. ఎలాగూ వచ్చాముగా... చెంచాలు అయినా కొందాం!" అని షాపులోకి అడుగు పెడుతూనే పర్సు జిప్ తీసి... లోపల మడతలుగా పెట్టి ఉన్న వస్తువుని తీసి విడదీసి, పర్సు జిప్పు వేసేసి ఆ వస్తువులో పడేసింది మంగ.

గతంలో ఎప్పుడో చీరలు షాపులో కొంటే ఇచ్చిన సంచీ అది.

"ఒసినీ...నోట్ల కట్టలు ఉన్నట్లు ఎన్ని బిల్డప్పులిచ్చిందీ..." అనుకుని ఆశ్చర్యపోయింది సుబ్బలక్ష్మి.


"ఆ డిజైన్ చెంచాలు లేవా? ఈ కాడ పొడుగ్గా ఉన్నవి లేవా? వెడల్పుగా ఉన్నవి లేవా?..." ఆ షాపులో ఉన్న అన్ని రకాల చెంచాలు తీయించింది.

విసుగు వచ్చిన సుబ్బలక్ష్మి షాపు అంతా పరిశీలించసాగింది.

"అబ్బే!...ఒక్కటీ బరువుగా లేవు...మరీ కాకులు ఎత్తుకుపోయేలా... ఇంత పల్చగా ఉన్నాయేమిటయ్యా?" అని ఆ కొట్లో కుర్రాడిని వందసార్లు తిప్పించి... హటాత్తుగా లేచి పోయింది మంగ.

"ఇంట్లో చెంచాలు లేవన్నావ్... కొనేసావా?" అడిగింది సుబ్బలక్ష్మి కూడా లేస్తూ.

"కొత్త డిజైను చెంచాలు ఏమైనా వచ్చాయేమో అని చూసాను వదినా... అయినా ఇంట్లో చెంచాలు లేకపోవడమేమిటీ నీ పరాచకం కాకపోతే. పద పద." అనేసి సుబ్బలక్ష్మి చెయ్యి పట్టుకుని వేగంగా నడిచింది మంగ.



మరో రెండు అడుగులు వేస్తే ఆ సందు మలుపు తిరిగేసేవారే!

అంతలో వెనుక నుంచి...

"మేడం... మేడం! మిమ్మల్నే మేడం..." విని పించింది.

ఎవరా అని వెనక్కి తిరిగి...

"ఎవరయ్యా...ఎవర్ని పిలుస్తున్నావ్?" ఆగి ఉరిమినట్టు చూసి అడిగింది... మంగ ఆ అబ్బాయిని!

"ఇవన్నీ ఏంటి మేడం... మిమ్మల్నే ఆగమని పిలుస్తున్నాను!" అన్నాడు అతను.

ఆ అబ్బాయి... స్టీలు సామాన్ల షాపులో చెంచాలు చూపించిన అబ్బాయి అని టక్కున గుర్తుకు వచ్చింది సుబ్బలక్ష్మికి.


"ఎందుకు ఆగమంటున్నావ్ మమ్మల్ని?" కోపంగా అడిగింది మంగ!

"మీకు చూపించిన చెంచాలలో నాలుగు రకాల చెంచాలు కనపడలేదు. వాటి లెక్క తక్కువైతే మా షాపు ఓనరు నా జీతంలో కోత పెడతాడు. ఓసారి మీ సంచి చూపించండి!" గదమాయించి అడిగాడు ఆ కుర్రాడు!

"అంటే... అంటే... వాటిని... మేం దొంగిలించాం అంటావా?!"

"నేను ఆ మాట అనలేదు... మీ సంచి ఒకసారి చూపించమంటున్నాను." మంగ కంటే గట్టి కంఠంతో అరిచాడు వాడు.

"నేనెవరో తెలుసా! రైల్వే ఇంజనీర్‌గారి భార్యని. మాకు అలాంటి ఖర్మ పట్టలేదు!" దబాయిస్తూ స్థిరంగా అంది మంగ.




"అవన్నీ నాకు అనవసరం. మీరు చూపిస్తారా... లేకపోతే సంచి లాక్కుని నన్ను చూడమంటారా?" సంచి లాక్కోవడానికి చెయ్యి ముందుకు చాచాడు వాడు.

సుబ్బలక్ష్మికి ... ప్రాణాల పైనే పోయినట్టయింది.

"ఆ సంచి వాడి మొహాన తగలెయ్ వదినా! ఆ షాపులో మనం ఏమీ కొననప్పుడు మనకేం భయం?" అంది సుబ్బలక్ష్మి

గత్యంతరం లేక ఆ సంచిలోనుంచి పర్సు తీసేసుకుని... వాడికి అందించింది మంగ చుట్టూ చూస్తూ.

వాడి అరుపులకి ఆ చుట్టుపక్కల దూరంగా ఉన్న కొందరు వాళ్ల స్థానాల్లో నిలబడి చూడసాగారు.


వాడు సంచిలో చెయ్యి పెట్టి... నాలుగు చెంచాలు తీశాడు.


"ఏం పని అమ్మా యిది? చూడ్డానికి గొప్ప కుటుంబం వాళ్ళలా ఉన్నారు!" అనేసి ఆ చెంచాలు తీసుకుని గిరుక్కున తిరిగి వేగంగా వెళ్ళిపోయాడు వాడు!

"ఆ కావాలని తీస్తామా?... అన్ని రకాల చెంచాలు చూస్తూ ఉంటే ఇందులోది అందులోనో... అందులోది ఇందులోనో... పడి ఉంటాయి. నా సంచిలో దొరికాయి కాబట్టి తీసుకువెళ్తున్నావ్! దొరక్కపోతే నీ జీతంలో కోతేగా! రా వదినా పోదాం!" వాడి జీతంలో కోత లేకుండా చేశానన్న ధీమాతో ముందుకు నడుస్తున్న మంగని చూస్తూనే నిలువెల్లా చెమటలు పట్టేసిన సుబ్బలక్ష్మి...

"అమ్మో! ఇంకా నయం! నేను చూడకుండా నువ్వు ఎప్పుడు తీసి సంచిలో పడేసావు... వదినా!" అని తనని అడిగి ఉంటే...

తన ప్రాణాలు అక్కడే పోయేవి... అనుకుంటూ మంగని అనుసరించింది!



# పదానందం 17

కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | |
| | | | | | | | 4 |
| 5 | | | | 6 | | | |
| | | | 7 | | | | |
| 8 | 9 | | | | | 10 | |
| | | | | | 11 | | |
| 12 | | 13 | | 14 | | 15 | |
| 16 | | | | 17 | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. నేను, నేనే అనే గర్వం (4)
3. మార్గం సరిగాలేదు (2)
5. పెళ్ళి (3)
6. తూర్పుకు వ్యతిరేకం (4)
8. ఇంటిగుట్టు...... అని సామెత (5)
10. భార్య (2)
11. వాగు, సాకు (2)
13. వ్యావహారికం (3)
15. మంగళసూత్రం (2)
16. జెండా (3)
17. సైనికుడు (3)

**నిలువు**

1. అలజడి, తారుమారైన పరిస్థితి (5)
2. హేతువు (3)
3. పొడుగ్గా ఉన్నవాడు పైకొచ్చాడు (4)
4) ధాన్యాన్ని పిండిచేసే సాధనం (4)
7. శ్రీకృష్ణుని స్నేహితుడు (4)
9. పురుషులూ కనేది (2)
10. తుంటరి (4)
12. వృద్ధుడు, బైరాగి (2)
13. భాగం (2)
14. కోపపు కోరిక (2)

సమాధానం వచ్చే సంచికలో


## గత సంచిక సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 పి | రి | 2 కి | | 3 తు | న | 4 క | |
| సి | | 5 లా | ఘ | వం | | 6 ల | 7 అ |
| నా | | డి | | | 8 కా | | క్క |
| 9 రి | 10 నా | | | 11 క | మా | 12 మీ | సు |
| | 13 ప | రా | 14 భ | వం | | గ | |
| | చే | | తి | | 15 క | డ | 16 లి |
| 17 అ | ను | 18 భ | వం | | త | | బూ |
| ప్పు | | ర్తీ | | 19 అ | మె | రి | కా |

మనోవికాసానికి మందు ఆనందం!
హాస్యానందం
తోనే ఇది సాధ్యం!
చందాదారులుగా
చేరండి. నవ్వుని మీ స్వంతం చేసుకోండి!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P


# మొక్క మనసు



మన మనసులే కాదు..
మన కొమ్మలు, వేర్లు కూడా
కలిసిపోయాయి.. ఇక
మనం పెళ్ళి చేసుకుందామా!!
అమ్మా!! నీలాగా
నేను కూడా ఎదిగితే
నన్ను కూడా నరికేస్తారు
కదూ!! ఎదగకుండా
యిలాగే వుండిపోవాలంటే
ఏమి చేయాలమ్మా!?
ఒకప్పుడు మన చాటున
ఈ బిల్డింగులుండేవి.. ఇప్పుడు
వాటి మాటున మనం
వుండాల్సిన గతి పట్టింది!!
మనిద్దరి మధ్య
తీవ్రమైన అభిప్రాయ
భేదాలు వచ్చాక ఇక
మనం కలిసి జీవించడం
అసాధ్యం!!
నువ్వు బోన్‌సాయ్
అని తెలియక మొదట్లో
ప్రేమించాను.. ఇప్పటికీ
మించిపోలేదు. నువ్వు పెరిగి
పైకి వస్తే నిన్నే పెళ్ళి
చేసు కుంటాను..!!
చీకటి పడగానే
ప్రతిరోజూ మనం
కలుసుకుంటున్నాం
కదా.. ఈ సమాజం
మన గురించి
తప్పుగా అనుకుంటుందేమో
మావా!!

Hasyanandam December-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC





చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548